కరీంనగర్ వార్త



కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శనివారం 4, జులై 2026 | 16 పేజీలు

రామగుండం అభివృద్ధికి
ఎన్‌టీపీసీ పెద్దపీట వేయాలి



16లో



అభివృద్ధి పనులలో

నిర్లక్ష్యం వహించవద్దు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: అమృత్ 2.0, స్వచ్ఛ భారత్ మిషన్, , 15వ ఆర్థిక సంఘం, జాతీయ ఆరోగ్య మిషన్, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, పీఎం శ్రీ, పీఎం కుసుమ్, జాతీయ రహదారులు తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అధికారులను ఆదేశించారు.

2 లో

- అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి.. ఎవరి ఒత్తుళ్లకు లొంగవద్దు
- కేంద్ర ప్రభుత్వ పథకాల పనులు గడువులోగా పూర్తి చేయాలి
- పూర్తయిన పనులకు రాజకీయ ప్రమేయం లేకుండా వెంటనే బిల్లులు చెల్లించాలి..
- కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలి
- డార్క్ స్పాట్స్ తొలగింపునకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల...
- పనులు ప్రారంభం చేయని కేంద్ర ప్రభుత్వ ఆర్ అండ్ బి శాఖ
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఎవరి కోసం వాయిదా వేయొద్దు..
- జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో ఎంపీ ధర్మపురి అరవింద్



2లో

నిలిచిన ఎలక్ట్రిక్ బస్సులు

- సాంకేతిక లోపాలు సరిదిద్దే పనిలో ఆర్టీసీ
- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- అగ్నిప్రమాదాలతో అప్రమత్తమైన ఆర్టీసీ
- సాంకేతిక లోపాలు సరిదిద్దాకే రోడ్డు ఎక్కే అవకాశం

ప్రభాతవార్త, సిరిసిల్ల బ్యూరో : మహాలక్ష్మీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తర్వాత బస్సులు మహిళా ప్రయాణికులతో రద్దీగా మారాయి. ఆర్టీసీ అధికారులు నడుపుతున్న ట్రిప్పులు సరిపోక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పల్లె వెలుగు, ఎక్స్రెస్ బస్సులు ప్రయాణికులతో రద్దీగా నడిచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికుల సౌకర్యార్థం ట్రిప్పుల సంఖ్యను కూడా ఆర్టీసీ అధికారులు పెంచారు.

ఇందిరా మహిళా శక్తితో
ఆర్థిక ప్రగతి..

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ఎస్‌హెచ్‌జీ మహిళల ఉపాధికి మార్గం : కలెక్టర్ గరిమ అగ్రవాల్

తంగళ్ళపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించిన కలెక్టర్

16లో



తంగళ్ళపల్లి,ప్రభాతవార్త ఇందిరా మహిళా శక్తి యూనిట్లు మహిళా సంఘాల ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.ఇందిరా మహిళా శక్తి కింద తంగళ్ళపల్లి మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) మహిళలు వెంకటసాయి కోల్డ్ ప్రెస్ ఆయిల్ !! ఫ్లోర్ మిల్ యూనిట్, కోవిదా మిల్క్ పాయింట్ ఏర్పాటు చేసుకోగా,జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రారంభించారు.వాటి పని తీరు, ఉపాధి, ఆదాయం తదితర వివరాలను మహిళలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి పనులలో నిర్లక్ష్యం వహించవద్దు

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

ఎవరి ఒత్తుళ్లకు లొంగవద్దు

కేంద్ర ప్రభుత్వ పథకాల పనులు గడువులోగా పూర్తి చేయాలి

పూర్తయిన పనులకు రాజకీయ ప్రమేయం లేకుండా వెంటనే బిల్లులు చెల్లించాలి.. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలి

డార్క్ స్పాట్స్ తొలగింపునకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల...

పనులు ప్రారంభం చేయని కేంద్ర ప్రభుత్వ ఆర్ అండ్ బి శాఖ

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఎవరి కోసం వేచి ఉండి వాయిదా వేయొద్దు..జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో ఎంపీ ధర్మపురి అరవింద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: అమృత్ 2.0, స్వచ్ఛ భారత్ మిషన్, , 15వ ఆర్థిక సంఘం, జాతీయ ఆరోగ్య మిషన్, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, పీఎం శ్రీ, పీఎం కుసుమ్, జాతీయ రహదారులు తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, అదనపు ఎస్పీ చేతన్ నితిన్, అదనపు కలెక్టర్ రాజ గౌడ్ లతో కలిసి నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో వివిధ శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పురోగతిని సంబంధిత శాఖ అధికారులు వివరించారు.ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ, అమృత్ 2.0 కింద చేపట్టిన తాగునీటి సరఫరా పనులను క్షేత్ర స్థాయిలో మరింత వేగవంతం చేయాలని సూచించారు. గత దిశా సమావేశంలో పెండింగ్ పనులు జూన్2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ పనులు ఆశించిన స్థాయిలో పూర్తికాలేదన్నారు. ఇకపై ప్రతి సమావేశంలో ప్రాజెక్టు వారీగా భౌతిక, ఆర్థిక పురోగతి, వ్యయ వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను ఇకపై మరింత కాలం పొడిగించేందుకు అవకాశం ఉండదన్నారు. పనులు చేపడుతున్న ఏజెన్సీలతో అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఏజెన్సీలకు వెంటనే నోటీసులు జారీ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.స్వచ్ఛ భారత్ మిషన్, యూ.ఐ.డీ.ఎఫ్.15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిచిపోకూడదన్నారు. కాంట్రాక్టర్లపై అధికారులు సమర్థవంతమైన పర్యవేక్షణ కొనసాగించాలని, గడువులోగా పనులు పూర్తి కాకపోతే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చూడాలని సూచించారు. సకాలంలో పనులు పూర్తి చేయకపోతే కేంద్ర నిధులు కోల్పోయే ప్రమాదం ఉందని, తద్వారా జిల్లా అభివృద్ధి దెబ్బతింటుందని అన్నారు.గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. పనులు పూర్తయినప్పటికీ రాజకీయ కారణాలతో బిల్లులు పెండింగ్‌లో ఉంచుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొంటూ, పూర్తయిన పనులకు రాజకీయ ప్రమేయం లేకుండా వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు.అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనవసర ఒత్తిళ్లు తీసుకువచ్చే వారిని చట్టబద్ధమైన విధానాల గురించి స్పష్టంగా అవగాహన కల్పించాలని, ప్రతి నిర్ణయంలో ప్రజా ప్రయోజనమే ప్రధానంగా ఉండాలని అన్నారు.అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఏ ప్రజాప్రతినిధి లేదా వ్యక్తి కోసం ఎదురుచూస్తూ వాయిదా వేయరాదని స్పష్టం చేశారు. అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రోటోకాల్‌ను కచ్చితంగా పాటిస్తూ, ప్రజలకు ఉపయోగపడే పనులను సకాలంలో ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు.జిల్లాలో 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్.పీ.వీ. టీకాల కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని అన్నారు. 10 వేల మంది బాలికలకు టీకాలు వేయాలనే లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 3,300 మందికి మాత్రమే టీకాలు అందినట్లు పేర్కొంటూ ప్రత్యేక కార్యాచరణతో లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు.మంజూరైన అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. ఆర్మూర్-జగిత్యాల-నిజామాబాద్ నాలుగు లేన్ల జాతీయ రహదారికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, కాంట్రాక్టర్ ఎంపిక ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. మరో రెండు నెలల్లో పనులు ప్రారంభమయ్యే అవకాశమున్నందున అప్పటిలోగా పెండింగ్‌లో ఉన్న సుమారు 1,200 ఎకరాల భూసేకరణ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.జాతీయ రహదారుల భూసేకరణ పరిహార చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేసి, సేకరించిన భూమిని వెంటనే సంబంధిత శాఖకు అప్పగించాలని సూచించారు.జాతీయ రహదారుల పై ప్రమాదకర ప్రాంతాల (డార్క్ స్పాట్స్) తొలగింపునకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, కేంద్ర ప్రభుత్వ ఆర్ అండ్ బి శాఖ పనితీరు పేలవంగా, అసంతృప్తిగా ఉందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి రోడ్లుభవనాల శాఖ అధికారులు చురుకుగా సమన్వయం చేసి వెంటనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జగిత్యాలలో కేంద్ర విద్యాలయం ఏర్పాటుకు తప్పనిసరిగా 10 ఎకరాల భూమిని కేటాయించాలని సూచించారు. అంతకంటే తక్కువ విస్తీర్ణంలో కే.వి. స్కూల్ నిర్వహించడం ఇబ్బంది గా ఉంటుందని తెలిపారు.పీఎం కుసుమ్, పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాలపై విస్తృత అవగాహన కల్పించి ఎక్కువ మంది లబ్ధిదారులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయానికి చలిగల్ వాళ్లంతరిలో 10 ఎకరాల స్థానం కేటాయించాలని, ఇతర ప్రాంతాలలో కేంద్ర విద్యాలయానికి పదే కళాశాల కేటాయించారు అని ఇక్కడ కూడా 10 ఎకరాల స్థలం కేటాయిస్తే భవిష్యత్తులో అందరికీ బాగుంటుందని ఆలస్యం చేయడానికి కారణమేమిటని పేర్కొన్నారు. అలాగే దిశా సమావేశానికి అదనపు ఎస్పి చేత నితిన్ సమావేశానికి హాజరుకాగా ఎస్పీ అశోక్ కుమార్ సమావేశానికి ఎందుకు రాలేదని దిశ సమావేశానికి తప్పనిసరిగా రావడం తెలియదా మరోసారి రెండు వారాల ముందే దిశా సమావేశం ఉన్నదని తెలువడం జరుగుతుందని, మరోసారి ఇలా జరగకుండా చూడాలని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ అమృత్ 2.0 పథకం కింద జగిత్యాలలో రూ.38.60 కోట్లు, కోరుట్లలో రూ.41.50 కోట్లు, మెట్‌పల్లిలో రూ.19.40 కోట్లు, రాయకల్‌లో రూ.15.20 కోట్లు, ధర్మపురిలో రూ.23 కోట్ల వ్యయంతో తాగునీటి సరఫరా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9 ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, సుమారు 165 కిలోమీటర్ల పైప్‌లైన్, గృహ నీటి కనెక్షన్ల పనులు పురోగతిలో ఉన్నాయని, ప్రభుత్వం గడువును డిసెంబర్2026 వరకు పొడిగించిందని, అప్పటిలోగా అన్ని పనులు పూర్తి చేస్తామని తెలిపారు.అమృత్ 2.0 కింద పట్టణ స్థానిక సంస్థల్లో రూ.18.80 కోట్ల వ్యయంతో ఆరు చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు, వాటిని జూన్ 2027 నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు.స్వచ్ఛ భారత్ మిషన్ కింద జగిత్యాలలో రూ.20 లక్షలతో ఆస్పిరేషనల్ టాయిలెట్ బ్లాక్, కోరుట్లలో రూ.2.17 కోట్లతో టాయిలెట్ బ్లాక్, యంత్రాల కొనుగోలు, మెట్‌పల్లిలో రూ.3.30 కోట్లతో వివిధ పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నట్లు వివరించారు.యూ.ఐ.డీ.ఎఫ్. కింద జగిత్యాలకు రూ.6.25 కోట్లు, కోరుట్లకు రూ.18.70 కోట్లు, మెట్‌పల్లికి రూ.18.70 కోట్లు, రాయకల్‌కు రూ.91.30 లక్షలు, ధర్మపురికి రూ.72.40 లక్షల విలువైన అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు.జాతీయ ఆరోగ్య మిషన్ కింద రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలు పూర్తయ్యాయని, మరో మూడు చివరి దశలో ఉండి ఆగస్టు2026 నాటికి పూర్తవుతాయని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో మంజూరైన 16 ఉపకేంద్రాల్లో 11 పూర్తయ్యాయని, ఐదు పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఎన్.హెచ్.ఎం. కింద మంజూరైన 103 ఉపకేంద్రాల్లో 10 పూర్తికాగా, 33 నిర్మాణ దశలో ఉండగా, మరో 60 పనులు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. జగిత్యాల-కరీంనగర్ మధ్య 58 కిలోమీటర్ల నాలుగు లేన్ల జాతీయ రహదారి563 పనులు రూ.2,400 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నట్లు తెలిపారు. భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు.ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రూ.38.65 కోట్లతో 12 రోడ్డు పనులు, రూ.20.70 కోట్లతో ఐదు వంతెనల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పీఎం శ్రీ పథకం కింద 31 పనులు చేపట్టగా, 16 పూర్తయ్యాయని, 97 శాతం నిధులు వినియోగించామని వివరించారు.పీఎం కుసుమ్ పథకం కింద 22 మంది రైతులతో 24 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏలు) పూర్తయ్యాయని, ఈ పథకం ద్వారా రైతులు 25 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.అదనపు ఎస్పీ చేతన్ నితిన్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ అత్యంత కఠిన చర్యలు చేపడుతోందని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా, దాడులు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని వివరించారు.ఈ సమావేశంలో దిశ కమిటీ సభ్యులు ఏ.భిక్యా నాయక్ , పాత రమేష్, వడ్డేపల్లి శ్రీనివాస్, ఎర్ర లక్ష్మీ, జిల్లా పరిషత్ సీఈఓ గౌతమ్ రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.



నిలిచిన ఎలక్ట్రిక్ బస్సులు

సాంకేతిక లోపాలు సరిదిద్దే పనిలో ఆర్టీసీ

ప్రయాణికులకు తప్పని తిప్పలు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

అగ్ని ప్రమాదాలతో అప్రమత్తమైన ఆర్టీసీ

సాంకేతిక లోపాలు సరిదిద్దాకే రోడ్డు ఎక్కే అవకాశం

ప్రభాతవార్త, సిరిసిల్ల బ్యూరో :

మహాలక్ష్మీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తర్వాత బస్సులు మహిళా ప్రయాణికులతో రద్దీగా మారాయి. ఆర్టీసీ అధికారులు నడుపుతున్న ట్రిప్పులు సరిపోక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పల్లె వెలుగు, ఎక్స్రెస్ బస్సులు ప్రయాణికులతో రద్దీగా నడిచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికుల సౌకర్యార్థం ట్రిప్పుల సంఖ్యను కూడా ఆర్టీసీ అధికారులు పెంచారు. దీంతో కొంతమేరకు ప్రయాణికులు ఉపశమనం పొందారు. ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టిన తర్వాత ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది తొలగింది. వెళ్లాలనుకున్న పట్టణాలకు, గ్రామాలకు ప్రయాణికులు సకాలంలో చేరుకున్నారు. తిరిగి అనుకున్న సమయానికి గమ్యస్థానాలకు చేరుకున్నారు. కానీ సాంకేతిక లోపాల నేపథ్యంలో ఈ నెల రెండు నుంచి ఎలక్ట్రిక్ బస్సులు నడపకుండా ఆర్టీసీ యాజమాన్యం నిలిపివేసింది. దీంతో బస్సులన్నీ ఆయా డిపోలకే పరిమితమయ్యాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎలక్ట్రిక్ బస్సులు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం ముందస్తు చర్యలు తీసుకుంది. అందులో భాగంగానే తాత్కాలికంగా ఎలక్ట్రిక్ బస్సులను నడపకుండా నిలిపివేసింది. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రయాణించే వారంతా ఇక పల్లె వెలుగు, ఎక్స్రెస్ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తుంది. బస్సుల సంఖ్య తక్కువగా ఉండడంతో వెళ్లాలనుకున్న ప్రాంతానికి సకాలంలో చేరుకోలేకపోతున్నారు. గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ అధికారులు మాత్రం ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. . ప్రతిరోజు ఎంతోమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు డిపోలకు పరిమితం కావడంతో కొంతమేరకు ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే ఆర్టీసీ అధికారులు మాత్రం హైదరాబాదు నుంచి బస్సులను తెప్పించి ప్రాంతాలకు నడుపుతున్నట్లు దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలగవని అధికారులు అంటున్నారు. ఇది ఇలా ఉండగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రంలో పలు జిల్లాల్లో బస్సులు అగ్ని ప్రమాదానికి గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలోని పలు డిపోల పరిధిలో విద్యుత్ లోపాలు, షార్ట్ సర్క్యూట్ కారణంగా బస్సులు కాలిపోయిన సంఘటనలు వెలుగు చూడడంతో ఆర్టీసీ యాజమాన్యం అప్రమత్తమైంది. ప్రయాణికుల రక్షణను దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే సాంకేతిక లోపాలను సవరించిన తర్వాతే ఆర్టీసీ యాజమాన్యం ఎలక్ట్రిక్ బస్సులను రోడ్డు ఎక్కించేందుకు నిర్ణయించుకుంది. సాంకేతిక లోపాలను పరిశీలించి సరిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. బస్సుల సంఖ్యను పెంచకపోతే ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పదు. ఈ క్రమంలోనే ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను ఆయా డిపోలకు రప్పించి ఇంతకుముందు ఎలక్ట్రిక్ బస్సులు నడిపిన పట్టణాలు, గ్రామాలకు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. లేని పక్షంలో మహాలక్ష్మీ పథకం లక్ష్యం దెబ్బతినడంతో పాటు మహిళ ప్రయాణికుల నుండి వ్యతిరేకత వచ్చే అవకాశాలు ఉన్నాయి. గుర్తించిన ప్రభుత్వం, అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఎలక్ట్రిక్ బస్సులు వేగంగా ప్రయాణించటం తో పాటు ప్రయాణికులకు ఎంతో సౌకర్యాన్ని కల్పించింది. ఒక్కసారిగా బస్సులను డిపోలకే పరిమితం చేయడంతో రవాణా వ్యవస్థ పై దెబ్బ పడనుంది. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వము, ఆర్టీసీ యాజమాన్యం తీసుకోవలసిన చర్యలను చేపట్టింది. ప్రయాణాలు నిత్యం కొనసాగుతాయి. ఈ క్రమంలో ఆర్టీసీకి ఆదాయం పెరగాలంటే ప్రత్యామ్నాయంగా బస్సులను సరిపడ ట్రిప్పులు నడపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిత్యం ఎంతోమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధుల నిర్వహణ నిమిత్తం ఆయా ప్రాంతాలకు వెళ్లి వచ్చేందుకు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. విద్యార్థులు కూడా గ్రామాల నుండి పట్టణాలకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు రోజు కళాశాలలకు వెళ్లి వస్తుంటారు.

CHANGE OF NAME..

I, Choutapalli Raghunadham,H.No.3-12Gollapelli Vill.&,Mandal, jagtial Dist -505532 Telan-gana Changed My Name As Choutapelli Raghunandam S/o. Choutapelli Narayana

అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్లను గడువులోగా పూర్తి చేయాలి

ఓదెల,ప్రభాతవార్త:



పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఓదెల మండలంలో విస్తృతంగా పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వర్యటనలో భాగంగా కొలనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవల తీరును పరిశీలించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన మందులు ఎల్ల ప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసు కోవాలని సూచిం చారు.అనంతరం కొమిర గ్రామంలో భూభారతి, మీ సేవ



దరఖాస్తులను క్షేతస్థాయిలో పరిశీలించి, పెండింగ్ లేకుం డా నిబంధనల మేరకు సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశిం చారు.ఓదెల మండల కేంద్రంలోని నూతన తహసీల్దార్ కార్యాలయం, నిరుపయోగంగా ఉన్న ఐకేపీ భవనం, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలను పరిశీలించిన కలెక్టర్, నూతన కార్యాలయంలో మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ఐకేపీ భవనాన్ని పునరుద్ధరించి కోర్టు నిర్వహణకు వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు.మండలంలో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను 10 రోజుల్లో, ఇతర అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఇందిరమ్మ గృహాలను పరిశీలించిన కలెక్టర్, మండలంలోని అన్ని ఇళ్ల నిర్మాణాలను జూలై 15లోపు పూర్తి చేసి లబ్ధిదారులు గృహప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ పర్య టనలో తహసీల్దార్ వనజ, ఎంపీడీవో అనిల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గనుల భద్రతపై కార్మికులకు అవగాహన

జీడీకే-1,3 ఇంక్లైన్‌లో రెస్క్యూ బృందం ప్రత్యక్ష శిక్షణ

అగ్నిప్రమాదాలు, గ్యాస్ లీకేజీలు, అత్యవసర పరిస్థితులపై సూచనలు

సీపీఆర్ విధానాన్ని డమ్మీ సహాయంతో ప్రదర్శించిన నిపుణులు

గోదావరిఖని, ప్రభాత వార్త:



భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సింగరేణి రామగుండం-1 ఏరియా పరిధిలోని జీడీకే-1,3 ఇంక్లైన్ గనిలో శుక్రవారం రెస్క్యూ సిబ్బంది ఆధ్వర్యంలో భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. గనుల్లో ఎప్పుడైనా తలెత్తే అత్యవసర పరిస్థితులను ధైర్యంగా, సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన జాగ్రత్తలు, ప్రాథమిక చర్యలపై కార్మికులకు సమగ్రంగా అవగాహన కల్పించారు.సదస్సులో భూగర్భ గనుల్లో సంభవించే గ్యాస్ లీకేజీలు, విషవాయువుల వ్యాప్తి, విద్యుత్ ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో కార్మికులు అనుసరించాల్సిన భద్రతా చర్యలను రెస్క్యూ అధికారులు వివరించారు. ప్రమాదం సంభవించినప్పుడు భయాందోళనలకు గురికాకుండా ముందుగా తమ ప్రాణాలను రక్షించుకోవడం, సహచరులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించడం వంటి అంశాలను వివరంగా తెలియజేశారు. అగ్నిప్రమాదాల సమయంలో అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలో రెస్క్యూ బృందం ప్రత్యక్షంగా ప్రదర్శించింది. మండుతున్న మంటలను అగ్నిమాపక యంత్రంతో నియంత్రించే విధానాన్ని కార్మికులకు చూపించి, వివిధ రకాల అగ్నిమాపక పరికరాల ఉపయోగం, వాటి నిర్వహణపై కూడా అవగాహన కల్పించారు. ప్రమాద సమయంలో తీసుకునే వేగవంతమైన నిర్ణయాలే ప్రాణనష్టాన్ని తగ్గిస్తాయని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా గుండె సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసుసిటేషన్) విధానాన్ని డమ్మీ మానవ నమూనా (మ్యానికిన్) సహాయంతో ప్రత్యక్షంగా ప్రదర్శించి శిక్షణ ఇచ్చారు. ప్రమాదానికి గురైన వ్యక్తికి తొలి నిమిషాల్లో సరైన ప్రథమ చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను రక్షించే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని రెస్క్యూ నిపుణులు వివరించారు. అవసరమైన సమయంలో ప్రతి కార్మికుడు ఈ విధానాన్ని అమలు చేయగలిగేలా సాధన చేయాలని సూచించారు.సురక్షిత పని విధానాలను ప్రతి కార్మికుడు తప్పనిసరిగా పాటించాలని, భద్రతా నిబంధనలను నిరక్ష్యం చేయకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు. అనంతరం గనుల భద్రత, ప్రమాదాల నివారణ, సురక్షిత విధానాల అమలుకు కట్టుబడి ఉంటామని కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో జీడీకే-1,3 ఇంక్లైన్ మేనేజర్ సుధీర్ జక్కుల్‌వార్, సేఫ్టీ ఆఫీసర్ జి. మహేష్, వెంటిలేషన్ అధికారి నూతి శ్రీనివాస్, పిట్ ఇంజనీర్ శేఖర్, సూపర్‌వైజర్లు, రెస్క్యూ సిబ్బంది, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. గనుల్లో భద్రతా సంస్కృతిని మరింత బలోపేతం చేయడంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

II ఏళ్లకు శవమై ఇంటికి..

స్వగ్రామం చేరిన వలస కార్మికుని మృతదేహం

సుద్దాలలో విషాదం

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



కుటుంబాన్ని పోషించుకునేందుకు సౌదీ అరేబియాకు 11 ఏళ్ల క్రితం ఇంటి నుండి వెళ్లిన వలస కార్మికుడు ఒక్కసారి కూడా ఇంటికి రాకుండా శుక్రవారం శవమై ఇంటికి చేరిన ఘటన కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బంధువులు వివరాలు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన దొబ్బల దాసు (46) అనే వలస కార్మికుడు సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతి చెందాడు. జూన్ 17వ తన గదిలో ఉండగా ఛాతిలో నొప్పి వస్తుందని స్నేహితులకు తెలపడంతో, ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలోనే గుండెపోటుతో మృతి చెందాడు. గత 11 ఏళ్లుగా సౌదీలోనే ఉంటూ కష్టపడి సంపాదించిన డబ్బును ఇండియాలోని తన కుటుంబానికి పంపిస్తున్నాప్పటికీ,తన తల్లి, కూతురి ఆరోగ్యం బాగాలేకపోవడం, మరోవైపు ఉన్న అప్పుల భారం పెరిగిపోవడంతో ఆర్థిక ఇబ్బందుల వల్ల 11 ఏళ్లలో ఒక్కసారి కూడా దాసు ఇంటికి రాలేకపోయాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక నిత్యం తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై గుండెపోటుతో మృతి చెందాడు. స్నేహితుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి తల్లి రత్నమ్మ, భార్య లక్ష్మి, కూతురు కీర్తన, కొడుకు ప్రసన్న కుమార్ ఉన్నారు. దాసు దహన సంస్కారాలకు చందాలు పోగు చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీపుల్స్ హాస్పిటల్‌పై దాడికి
పాల్పడ్డ వ్యక్తులు రిమాండ్

ముస్తాబాద్ ప్రభాతవార్త:

ముస్తాబాద్ మండల కేంద్రములో నున్న పీపుల్స్ హాస్పిటల్ పై దాడి చేసిన వ్యక్తులను రిమాండ్ కు తరలించినట్లు మండల ఎస్సై జ్యోతి తెలిపారు.జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం పీపుల్స్ హాస్పిటల్ లో 10 రోజుల కిందట చాకలి మహేష్ భార్య సంగీత పురిటి నొప్పులతో బాధపడుతున్న సమయములో హాస్పిటల్ కు రాత్రి11 గంటల సమయములో తీసుకెళ్లగా డాక్టర్ శంకర్ ఆమెను పరీక్షించి ప్రస్తుతం రేడియోలాజిస్ట్ లేడని రేపు రమ్మని చెప్పగా,పేషంట్ పరిస్థితి విషమంగా వుండటముతో చికిత్స చేయని కోరగా డాక్టర్ శంకర్ చికిత్స అందించారు మరునాడు మధ్యాహ్నం రేడియోలాజిస్ట్ వచ్చి సంగీతకు స్కానింగ్ నిర్వహించగా కడుపులో వున్న పిండం 3 రోజుల క్రితమే చనిపోయిందని నిర్ధారించగా,మెరుగైన వైద్యం కోసం పెద్ద హాస్పిటల్ కు వెళ్ళమని తెలుపగా,గురువారం ఉదయం పేషంట్ భర్త హాస్పిటల్‌పై దాడి చేసి 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా అత నిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరాలు వెల్లడించారు.

నేరాలు-దారుణాలు

తాళ్లపల్లి ఆగ్రో ఇండస్ట్రీస్ లో అగ్ని ప్రమాదం

కోటిన్నర పైగా నష్టం వాటిల్లిందని నిర్వాహకుల అంచనా

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలంలోని తాళ్లపల్లి గ్రామ శివారులో ఉన్న ఆగ్రో ఇండస్ట్రీస్ లో శుక్రవారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం జరిగినట్లు మిల్లు నిర్వా హకులు పేర్కొన్నారు.మిల్లులో నిల్వ చేసిన సుమారు 3 వేల క్వింటాళ్ల పత్తి గింజలు పూర్తిగా దగ్ధమయ్యా యన్నారు.సుమారు కోటిన్నర పైగా నష్టం వాటిల్లిందని యజమాన్యం పేర్కొంది.పత్తి గింజల రాపిడి వల్ల మంటలు చెలరేగినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పారు.పత్తి గింజలు మాత్రమే పూర్తిగా కాలిపోయాయి.ఎస్సై అశోక్ సంఘటనా స్థలాన్ని పరి శీలించి వివరాలు సేకరించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో సెక్యూరిటీ గార్డు మృతి

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:



కొత్త పెళ్లి మండలం కమాన్ పూర్ గ్రామంలో గ్రానైట్ క్వారీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న వ్యక్తి అనుమా నాస్పద స్థితిలో మృతి చెందాడు. కొత్తపెళ్లి పోలీసుల కథనం మేరకు సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రహీం ఖాన్ పేటకు చెందిన మామిడి పరుశురాం 46 సెక్యూరిటీ కంపెనీలో గార్డుగా చేరి గ్రానైట్ క్వారీలో పనిచేయుచున్నాడు. గురువారం రాత్రి యధావిధిగా విధులకు హాజరైన పరుశురాం గుట్ట పై భాగంలో విధులు నిర్వర్తించాడు. శుక్రవారం ఉదయం విధులకు వచ్చిన ఇంకో సెక్యూరిటీ గార్డ్ పరశురాం అపస్మారక స్థితిలో పడి ఉండడం గమనించి క్వారీ సూపర్వైజర్ కు సమాచారం అందించారు. పరశురాం అప్పటికే మృతి చెంది ఉండడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని బంధువు నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ కోటేశ్వర్ తెలిపారు.

ఆరు గ్యారంటీలు, తులం బంగారంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

వీణవంక: ప్రభాత వార్త:ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, తులం బంగారం హామీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వీణవంక మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివిధ గ్రామాలకు చెందిన 48 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్యాణలక్ష్మీ, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, రైతుబంధు వంటి సంక్షేమ పథకాలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మీ పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టత ఇవ్వడం లేదని, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.రాష్ట్రంలో యూరియా కొరత, సరిపడా వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు అవసరం ఎంత కీలకమో స్పష్టమవుతోందని తెలిపారు. వీణవంక మండలంలో ఇసుక క్వారీల కారణంగా గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల మల్లారెడ్డిపల్లి, దేశాయ్‌పల్లి, పోతిరెడ్డిపల్లి, కోర్కల్, హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.మండలంలో పక్కనే మానేరు వాగు పారుతున్నా స్థానిక ప్రజలకు పిడికెడు ఇసుక కూడా దొరకడం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. అలాగే కల్వల ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు సాగునీరు అందించాలని, 30 కోట్లతో చేపట్టిన వీణవంక రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ ముద్దసాని రమేష్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న, సర్పంచులు మ్యాదగోని తిరుపతి, మండల కుమార్, రామిడి తిరుపతి రెడ్డి, గాజుల శంకర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



మాస్టర్ ప్లాన్ తోనే కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధి వేగవంతం చేస్తాం

ముఖ్యమంత్రి దృష్టికి మాస్టర్ ప్లాన్ అంశం

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న

పిసిసి చీఫ్ మహేష్ కుమార్

ఘనంగా సన్మానించిన చొప్పదండి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల /ప్రభాతవార్త



తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేతం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, తెలుగు రాష్ట్రాల భక్తులతోపాటు పొరుగు రాష్ట్రాల నుండి కూడా శ్రీ స్వామి వారిని కొలిచేందుకు తరలి వస్తారని, ఇందుకోసం త్వరలోనే కొండగట్టు ఆలయ అభివృద్ధి కి మాస్టర్ ప్లాన్అమలుపరిచేందుకు రంగం సిద్ధం అవుతున్నట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు, శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు, ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు, ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శ్రీ స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనం చేశారు, ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ని ఘనంగా సన్మానించారు, అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి తాను ఎన్నోసార్లు వచ్చి స్వామివారిని దర్శించుకున్నానని, కొండగట్టు ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని, ఈ అంశాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సీఎం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తున్నారని కూడా వెల్లడించారు, త్వరలోనే మాస్టర్ ప్లాన్ అమలులోకి వచ్చి ఆలయ అభివృద్ధి వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరలుగా పేద ప్రజల ఆకాంక్షలను అనుగుణంగా పనిచేస్తుందన్నారు, ముఖ్యమంత్రి చేపడుతున్న ప్రజా సంక్షేమ , అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగేలా స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు అన్నారు, కార్యక్రమంలో కరీంనగర్ డిసిసి అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తో పాటు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జగిత్యాల డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్, పలువురు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి

- విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లిలో నూతన కాంగ్రెస్ పార్టీ

కార్యాలయం ప్రారంభం

వల్లంపల్లిలో బీఎల్ఏలకు

అవగాహన సమావేశం

భీమారం/మేడిపల్లి, ప్రభాతవార్త :



ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) పాత్ర అత్యంత కీలకమని, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి గ్రామంలో మేడిపల్లి, భీమారం మండలాల బీఎల్ఏలకు నిర్వహించిన అవగాహన నిర్వహించారు. ఈ కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య పాల్గొని మేడిపల్లి మండల కేంద్రంలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఓటరు తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, పేరు లేకుంటే సంబంధిత దరఖాస్తులు సమర్పించేలా బీఎల్ఏలు ప్రజలకు సహకరించాలని సూచించారు. గల్ఫ్ దేశాలు, విదేశాల్లో ఉన్న వారి వివరాలను కుటుంబ సభ్యులు అధికారులకు అందజేయాలని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో అనుమానాస్పద జాబితాలో ఉన్న ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు సహాయం చేయాలని బీఎల్ఏలకు సూచించారు. బీజేపీ ఓట్ల సవరణ పేరుతో ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించే కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రజలు నిరక్ష ్యం చేయకుండా తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు వెంటనే ఓటరు జాబితాను పరిశీలించాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మేడిపల్లి, భీమారం మండలాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. మొదటి విడత తర్వాత రెండో విడత మంజూర్లు కొనసాగుతున్నాయని, కొత్త దరఖాస్తుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. బేస్‌మెంట్ లేదా స్లాబ్ దశలో నిలిచిపోయిన ఇళ్లకు కూడా పథకం వర్తిస్తుందని, స్థలం లేని అర్హులకు స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటు హక్కు పొందాలని కోరారు. స్థానికులు బీఎల్ఓలకు సహకరించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, ఏనుగు రమేష్ రెడ్డి బండ శంకర్, మ్యాదం వినోద్ కుందారపు జలందర్ మకిలి ఇజ్రాయిల్, చేవూరి నాగరాజు, నవీనరెడ్డి, సాయిని గంగారెడ్డి, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు



పోరుమల్లలో సీజనల్ వ్యాధులపై విస్తృత అవగాహన కార్యక్రమం

మేడిపల్లి, ప్రభాతవార్త :

మేడిపల్లి మండలంలోని పోరుమల్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, జాండీస్ తదితర వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌సీవీబీసీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, మేడిపల్లి వైద్యాధికారి డాక్టర్ రమా ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం, దోమల నివారణ చర్యలు పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని విద్యార్థులకు, గ్రామస్థులకు వివరించారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎంఓ సత్యనారాయణ, ఎస్‌వీఓ శ్రీధర్, మెట్‌పల్లి ఎస్‌వీఓ విలయత్ బేగ్, సూపర్‌వైజర్ రమేష్, హెల్త్ అసిస్టెంట్ తిరుపతి రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ ఉపసర్పంచ్ ప్రణయ్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ అవగాహన సదస్సు

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :



స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా కోరుట్ల మండలంలోని కల్లూరు గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం సాలిడ్ వేస్ట్ మానేజ్మెంట్ రూల్స్, 2026 ప్రకారం ఇంటింటి చెత్త సేకరణ, నాలుగు రకాల చెత్త వేరుచేతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎంపీడీవో వోదెల రామకృష్ణ మాట్లాడుతూ గ్రామ ప్రజలు తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ వ్యర్థాలు, ప్రత్యేక జాగ్రత్త అవసరమైన వ్యర్థాలను తప్పనిసరిగా విడివిడిగా వేరు చేసి గ్రామ పంచాయతీకి అందించాలని సూచించారు. ప్రతి ఇంటిలో చెత్తను మూలస్థాయిలోనే వేరు చేయడం ద్వారా గ్రామ పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ఎస్డబ్ల్యూఎం రూల్స్ , 2026 అమలులో భాగంగా గ్రామంలో నాలుగు రకాల చెత్తను సక్రమంగా వేరు చేసి అందిస్తున్న ఉత్తమ గృహాలకు, అలాగే ఉత్తమ సేవలు అందిస్తున్న స్వచ్ఛ కార్యకర్తలకు త్వరలో ఎంపీడీవో చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్నేని లత, ఉపసర్పంచ్ జంగా స్వామి , పంచాయతీ కార్యదర్శి సరిత , వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుమ్లాపూర్ ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

చొప్పదండి,ప్రభాతవార్త:



గుమ్లాపూర్ లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పాఠశాల ఆవరణలో పుస్తకాలు పంపిణీ చేశారు. కరీంనగర్ జిల్లా మాజీ గ్రంధాల సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం నోట్ బుక్స్ పంపిణీ లో భాగంగా గుమ్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నోటుబుక్కులు పెన్నులు పంపిణీ చేశారు.గుమ్లాపూర్ భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు బీసావేణి రాజశేఖర్ గౌడ్, గడుగు రాజేశం ముదిరాజ్, మదిరే రాజమౌలి, కాషావేణి మల్లేశం యాదవ్, చిర్ర రమేష్, జోగినాపెల్లి శ్రీకాంత్ రావు, సందవేణి తిరుపతి, గుంళ్ల శేఖర్, పెరుమాండ్ల శ్రీనివాస్ గౌడ్, మెండే కొమురయ్య, మండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ మహిళా కార్మికులకు చీరల పంపిణీ

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి పట్టణంలో తెలంగాణ ఉద్యమకారుడు, యువనేత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మిత్రుడు జర్నలిస్ట్ కందుల స్కైలాబ్ గౌడ్ శుక్రవారం రోజున పేద భవన నిర్మాణ కార్మికులకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కైలాబ్ గౌడ్ మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ సపోర్ట్ లేకుండా, రాజకీయ యువ నేతగా జిల్లాలోనే కాకుండా, రాష్ట్రంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న రవీందర్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గడి పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణంలోని ప్రాథమిక పాఠశాల ఎస్ఆర్ఎస్పి క్యాంప్ గడి కల్లూరు రోడ్‌లో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య బృందం విద్యార్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, దంత సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి తదుపరి చికిత్స కోసం కోరుట్ల సివిల్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ప్రధానోపాధ్యాయులు సునావత్ రాజు తెలిపారు. వైద్య బృందానికి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రహూఫ్, పూర్ణ చందర్, ధన లక్ష్మి ,సుమలత, రాజ్ కుమార్, శ్రీనివాస్,వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి

కలెక్టర్ హరిత

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 3, ప్రభాతవార్త :



ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హరిత పేర్కొన్నారు. శుక్రవారం తిర్యాణి మండల కేంద్రంలో ఓటరు ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి సేకరించి వెంటనే డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడి ఫారాలను పూర్తిగా నింపించుకొని ఆ నింపిన ఫారాలను సేకరించి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్లు డిజిటలైజేషన్‌కు పంపించాలని సూచించారు. ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని, ఈ ప్రక్రియలో నిరక్ష్య వహిస్తే భవిష్యత్తులో ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. యువజన సంఘాలు, చదువుకున్న యువత, గ్రామస్థులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఫారం నింపే ప్రక్రియపై గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అన్నారు. గడువు తక్కువగా ఉన్నందున అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటిస్తూ పనితీరును పర్యవేక్షించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను బిఎల్ఓలకు తిరిగి ఇవ్వకుండా నిరక్ష్యం చేస్తే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, బీఎల్వోలు, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూలై 3, ప్రభాతవార్త



జిల్లాలో సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, టాస్క్ ఫోర్స్ ఓ.ఎస్.డి. శ్రీధర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించి సి.ఎం.ఆర్. లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, రైస్ మిల్లర్లు లక్ష్య సాధన దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు చేయవలసిన చెల్లింపులను త్వరగా పూర్తి చేయాలని, డీలర్లకు కేటాయించిన ప్రకారంగా ధాన్యం తరలింపు వేగవంతం చేయాలని తెలిపారు. డిఫాల్టర్లు త్వరగా బకాయిలు 70 శాతం వరకు చెల్లించాలని, ఆగస్టు 31వ తేదీ లోగా సి ఎం ఆర్ డెలివరీ పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు చేరాలి

ఎంపీ గోడం నగేశ్

ప్రజా సమస్యలపై అధికారులు బాధ్యతగా స్పందించాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి: జూలై 03, ప్రభాతవార్త:





కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు సమర్థవంతంగా కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. గత ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, కేంద్రరాష్ట్ర పథకాల అమలు, పెండింగ్ పనులు, భౌతిక, ఆర్థిక పురోగతిపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ, పీఎంజీఎస్‌వై, ఇందిరమ్మ ఇండ్లు, పీఎం కిసాన్, మధ్యాహ్న భోజన పథకం, జాతీయ ఆరోగ్య మిషన్, పీఎం శ్రీ పాఠశాలలు, ఐసీడీఎస్, బీఎస్ఎన్ఎల్, జాతీయ రహదారులు, బ్యాంకింగ్ తదితర శాఖల పనితీరును సమీక్షించారు. ఎంపీ నగేశ్ మాట్లాడుతూ, ప్రతి శాఖ పనితీరును విడివిడిగా సమీక్షించి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. ఉపాధి హామీ కింద ప్రతి జాబ్‌కార్డు దారునికి పని కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లు, అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయాలని, రేషన్ బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధి పనుల్లో సమాన పనిదినాలు, సమాన వేతనం అమలు చేయాలని, యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. రైతులకు ఖియూరియా యాప్‌ఖి వినియోగంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ అనుమతుల సమస్యను పరిష్కరించి, నిర్మాణాల్లో నాణ్యత పాటించాలన్నారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, భైంసా సమీప జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, బాసర వంతెనను ప్రమాదరహితంగా తీర్చిదిద్దాలని కోరారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులకు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని, ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ మ్యాప్‌లు లేని 14 గ్రామాల్లో సర్వేలు, 70 గ్రామాల్లో రీ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 1.74 లక్షల జాబ్‌కార్డుదారులకు ఉపాధి కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కింద 2,136 గృహాలు పూర్తిచేసి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.146 కోట్లు జమ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి రూ.17.74 కోట్లు, 20 పీఎం శ్రీ పాఠశాలలకు రూ.1.34 కోట్లు వ్యయం చేశారు. 2.49 లక్షల రేషన్ కార్డుల ద్వారా ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా, 41,950 కొత్త కార్డులు జారీ చేశారు. పీఎం కిసాన్ కింద 53 వేల మంది రైతులకు రూ.32 కోట్ల ఆర్థిక సాయం అందించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్ఓ రాథోడ్ రమేష్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఖానాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ అంకం మోనిక, భైంసా చైర్మన్ దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై అందుబాటులో కందుల విత్తనాలు

కొడిమ్యాల, ప్రభాతవార్త:

రైతులకు నాణ్యమైన కందుల విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం, పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ ఆన్ ఆత్మనిర్భరత ఇన్ పల్సెస్ పథకం కింద కందుల విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి జ్యోతి తెలిపారు. ఈ పథకం ద్వారా పిఆర్ జీ176 రకం కందుల విత్తనాలు 4 కిలోల బ్యాగ్‌లలో రైతులకు అందుబాటులో ఉన్నాయని ఒక్కో బ్యాగ్ పూర్తి ధర రూ.520 కాగా ప్రభుత్వం రూ.120 సబ్సిడీ అందిస్తోంది. దీంతో రైతులు రూ.400 మాత్రమే చెల్లించి విత్తనాలను పొందవచ్చు. సబ్సిడీ విత్తనాలు పొందాలనుకునే రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ నంబర్ వివరాలతో తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి లేదా సంబంధిత వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలతో కందుల సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

గంభీరావుపేటలో అధునాతన రైతు మార్కెట్ నిర్మాణం

కేసిఆర్ రైతు మార్కెట్ పేరిట నిర్మాణానికి హామీ ఇచ్చిన కేటిఆర్

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ను కలిసిన పాలకవర్గ సభ్యులు

గంభీరావుపేట, ప్రభాతవార్త:



గంభీరావుపేట మండల కేంద్రానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మరో కీలక హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో ప్రజలకు, వ్యాపారులకు ఎంతో ఉపయోగపడేలా ఆధునాతన నిత్యం కూరగాయల మార్కెట్ షెడ్‌ను నిర్మించి ఇస్తానని ఆయన ప్రకటించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ తోపాటు మెజార్టీ మేజర్ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం సమీపంలో మోడల్ కూరగాయల మార్కెట్ షెడ్ నిర్మించాలని కోరారు. ప్రస్తుతం వ్యాపారులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వారి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేటీఆర్, మార్కెట్‌ను 'కేసీఆర్ కూరగాయల మార్కెట్' పేరిట తన స్వంత ఖర్చులతో నిర్మిస్తానని ప్రకటించారు. ఈ మార్కెట్ నిర్మాణంతో కూరగాయల వ్యాపారులకు శాశ్వత వసతి, వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నట్లు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అడగగానే స్పందించి మార్కెట్ నిర్మాణానికి హామీ ఇచ్చిన కేటీఆర్ కి బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి, వార్డు సభ్యులు గ్యార దేవరాజు, ఎగదండి స్వామి, రెడ్డి మల్ల రాజనర్సు, పిట్ట శ్రీమతి, అర్జున్, చిలుక ప్రశాంత్, పార్టీ మండల అధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, చేరాల నిఖిల్ గౌడ్, ఈరవేణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసును చేదించిన పోలీసులు

ధర్మపురి,ప్రభాతవార్త

ధర్మపురి పట్టణంలో రాపర్తి నారాయణ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరగగా,చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు శుక్ర వారం అదుపులోకి తీసు కున్నారు. చోరీకి గురైన 2 తులాల బంగారు గొలుసు, 14 తులాల వెండి ఆభరణా లను రికవరీ చేశారు. ఇట్టి కేసుకు సంబంధించి ఎస్సై మహేష్ వివరిస్తూ,చోరీకి పాల్పడిన వ్యక్తి మైనర్ అని, గతంలో ఇదే నిందితుడు ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లగా అట్టి వాహనాన్ని సైతం రికవరీ చేసినట్లు తెలిపారు. కాగా చోరీ జరిగిన 24 గంటల్లోనే కేసును చేదించడంతో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డి.ఎస్.పి పురుషోత్తం స్పందించి స్థానిక సిఐ రాం నర్సింహారెడ్డి, ఎస్ఐ మహేష్ లను అభినందించినట్లు తెలిసింది.



వేములకుర్తిలో ప్రీప్రైమరీ తరగతుల ప్రారంభం

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :



మండలంలోని వేములకుర్తి గ్రామ ప్రాథమిక పాఠశాల (బండమీది బడి)లో శుక్రవారం ప్రీప్రైమరీ తరగతులను గ్రామ సర్పంచ్ తరి రామ నుజం, ప్రధానోపాధ్యాయులు గంగమణి, ఎస్ఎంసీ చైర్మన్ మగ్గిడి భవాని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి వారి భవిష్యత్ విద్యాభ్యాసానికి ఆశీర్వాదాలు అందించారు. ప్రతి చిన్నారి ప్రభుత్వ పాఠశాలలో చేరి నాణ్యమైన విద్యను అభ్యసించాలని వారు ఆకాంక్షించారు. ప్రీప్రైమరీ తరగతుల ప్రారంభంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతోందని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ సంయుక్త కార్యదర్శి పెంట లింబద్రి, నాయకులు నాంపల్లి వెంకటాద్రి, బుర్రి ముత్యం, ఉపాధ్యాయురాలు హర్షశ్రీతో పాటు గ్రామస్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి:

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్



మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త : బీజేపీ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నిజామా బాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సూచించారు. శుక్రవారం జగిత్యాలలో మెట్పల్లి బీజేపీ పట్టణ నూతన కార్యవర్గ సభ్యులను పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలతో మమేకమై ఉద్యమాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అనంతరం నూతన పట్టణ కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేసి సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని వారికి సూచించారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త, జూలై3: జిల్లాలో కురుస్తున్న వర్షాలు, సంభవించే విపత్తు పరిస్థితుల నేపథ్యంలో అన్ని శాఖల అధి కారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. శుక్రవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వర్షాల పరిస్థి తులు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు.లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి.భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వాగులు, వంకలు, చెరువుల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వరద ముప్పు ఉన్న ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలుప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.అధికారులు అందుబాటులో ఉండాలి.గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర సేవలు, సహాయక చర్యలు వెంటనే అందుబాటులో ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ కార్మికుల పాదాలు కడిగి బీజేపీ నేతలు

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త :



ప్రధాని నరేంద్ర మోదీ పాలనకు 12 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న సుపరిపాలన దినోత్సవాల సందర్భంగా మెట్పల్లి పట్టణ 14వ వార్డు కౌన్సిలర్ ధోనికెల శిరీష , బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 14వ వార్డుకు చెందిన పారిశుద్ధ కార్మికుల పాదాలను నీటితో శుద్ధి చేసి, వారికి కొత్త దుస్తులు అందజేసి సన్మానించారు. అనంతరం ధోనికెల నవీన్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ కార్మికుల సేవలు అమూల్యమైనవని, వారి కృషిని గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో పారిశుద్ధ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బత్తుల జగదీశ్వర్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యల లక్ష్మణ్, పట్టణ ఉపాధ్యక్షుడు లోలపు అనిల్, కోశాధికారి తల్లోజు భాస్కర్, ఐటీ సెల్ కన్వీనర్ పాసికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేలంలో కొనుగోలు చేసిన ధాన్యం, బకాయిల చెల్లింపులపై సమీక్ష.



ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త, జూలై3: వేలంలో కొనుగోలు చేసిన ధాన్యం, బకాయిలు చెల్లించని రైస్ మిల్లుల నుంచి తెలంగాణ పౌర సరఫరాల సంస్థకు రావలసిన బకాయిల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ పౌర సరఫరాల సంస్థ అమలు విభాగం అధికారి ప్రభాకర్ రెడ్డితో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో బకాయిల వసూళ్ల పురోగతి, వేలంలో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన అంశాలను అధికారులతో, రైస్ మిల్లుల యజమానులతో సమీక్షించారు. ప్రభుత్వానికి రావలసిన బకాయిల వసూళ్లలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లుల యజమానులు పరస్పర సమన్వయంతో పనిచేసి బకాయిల చెల్లింపుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఫైజల్ హుస్సేన్, జిల్లా నిర్వాహకురాలు కృష్ణవేణి, జిల్లా సాంకేతిక సమన్వయ అధికారి విజయ్ కుమార్, రైస్ మిల్లుల యజమానులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా చిట్యాల సాగర్

వెంకటాపురం ప్రభాత వార్త,

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వెంకటాపురం మండల అధ్యక్షుడిగా ఉప్పేడు వీరాపురం గ్రామ పంచాయతీ వెంగళరావు పేట గామానికి చెందిన చిట్యాల సాగర్ ను నియ మించారు. ఈ మేరకు సాగర్ కు నియామక పత్రాన్ని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టెవాడ తిరుపతి ములుగు లో మంత్రి సీతక్క చేతుల మీదుగా నియమాక పత్రాన్ని శుక్రవారం అందజేశారు . ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకులా అశోక్ ,భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మెట్‌పల్లి వార్త

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల విజృంభణ

అప్రమత్తతే ఆయుధం

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త : వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు క్రమంగా పెరుగుతున్నాయి. వర్షపు నీరు నిల్వ ఉండడం, పారిశుధ్య లోపాలు, కలుషిత నీటి వినియోగం కారణంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, విరేచనాలు వంటి వ్యాధులు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. గ్రామాల్లో రోడ్ల పక్కన, ఇళ్ల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో డెంగ్యూ, మలేరియా కేసులు నమోదవుతున్నాయి. మరోవైపు కలుషితమైన తాగునీటి కారణంగా జీర్ణాశయ సంబంధిత వ్యాధులు కూడా పెరుగుతున్నాయి. వైద్య నిపుణుల సూచనల మేరకు ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు మరిగించిన నీటినే తాగాలి. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచిస్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది కొరత, తగిన అవగాహన లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గ్రామ పంచాయతీలు, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ఫాగింగ్, పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. వర్షాకాలంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు

గల్ఫ్ కార్మికుడికి గుర్తింపుకై ప్రవాసి ప్రజావాణిలో వినతి

మెట్‌పల్లి,ప్రభాతవార్త:



మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన బత్తిని రాజా గౌడ్ ఉపాధి కోసం గత కొన్ని సంవత్సరాల నుండి సౌదీ,కత్తర్, కువైట్ వెళ్లి ప్రస్తుతం అబుదాబీలో ఉన్న అతను చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించాలని హైదరాబాద్ లో శుక్రవారం ప్రవాసి ప్రజావాణి లో కుటుంబ సభ్యులు వినతిపత్రం అందచేశారు.రాజగౌడ్ గీతా కార్మికుని వృత్తి కొనసాగిస్తూ చెట్లు లేకపోవడం వల్ల ఉపాధి కొరకు విదేశాలకు వెళ్లడం జరిగిందని,తన భర్త నాడు తెలంగాణ రాష్ట్రం కొరకు గ్రామ గ్రామాన విచిత్ర వేషాధారణతో కరపత్రాలతో,తన యొక్క పాటలతో 2001 సంవత్సరం నుండి తెలంగాణ రాష్ట్రం కొరకు వివిధ కార్యక్రమాలు చేసాడని తెలిపారు.గతంలో ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం హయాంలో చాలా ప్రోగ్రామ్స్ చేశాడని,విద్యావాలంటరీగా,వయోజన విద్య శాఖ నిరంతర విద్యకేంద్ర వెల్లుల్ల ప్రేరక్ గా, మెట్పల్లి మండల్ ఇన్చార్జిగా,ఐకెపి జాబ్ వాలంటరీ చేశాడని,అలాగే గల్ఫ్ కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా తాను ముందుండి యూఏఈ లో ఇప్పటివరకు సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు.కావున ప్రజా ప్రభుత్వం రాజగౌడ్ కు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో అడ్వాటైజరీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ మంద భీమ్ రెడ్డి,భార్గవి నద్దునూరి, సీఎం ప్రవాసీ ప్రజావాణి లైజన్ ఆఫీసర్,మెంబర్ నంగి దేవేందర్ రెడ్డి,అరవ శ్రీనివాస్,స్పందన,వైష్ణవి,పాల్గొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్ 12 విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ఆపరేషన్ ముస్కాన్ పై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త:



జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ 12 విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఆపరేషన్ ముస్కాన్ 12 పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ తప్పిపోయిన, పారిపోయిన పిల్లలు బాల కార్మికులుగా మారిన వారిని సంరక్షించి వారి స్వస్థలాలకు చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ప్రతి సంవత్సరం జనవరి, జూలై నెలల్లో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 1 వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తప్పిపోయిన, పారిపోయిన పిల్లల్ని వెతికి పట్టుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిన దర్పన్ యాప్ ను వినియోగించాలని సూచించారు. అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ నుండి మిస్సింగ్ చిల్డ్రన్ సంబంధిత సమాచారం తీసుకుని అన్ని విభాగాలు సమన్వయంతో వారిని గుర్తించేందుకు చేరదీసేందుకు కృషి చేయాలని తెలిపారు. ఇటుక బట్టీలు, బేకరీ షాపులు, మెకానిక్ షాప్ లు, ఇండ్ల నిర్మాణ పనులు, వ్యవసాయ పనులు, ఇతర పనుల్లో బాల కార్మికులతో పని చేయించుకోవడం నేరమని స్పష్టం చేశారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై కఠినంగా వ్యవహరించాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారించాలని సూచించారు. అలాగే బాల కార్మికులుగా మారిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగిస్తూ వారికి కౌన్సిలింగ్ చేయాలని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడే పిల్లలను గుర్తించాలని సూచించారు. వారిని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చేర్పించాలని పేర్కొన్నారు. పిల్లల యొక్క బంగారు భవిష్యత్తు కోసం కౌన్సిలింగ్ నిర్వహించి విద్యారంగం వైపు వెళ్లేలా చూడాలని తెలిపారు. ఒకవేళ విద్య పట్ల ఆసక్తి లేకపోతే ఏదైనా శిక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయించాలని, ఐ టీ ఐ ఏటీసీ పాలిటెక్నిక్, న్యాక్ లాంటి సంస్థల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బస్ స్టేషన్, బస్సులలో ఎవరైనా అనాథ పిల్లలు, మహిళలు కనపడితే 1098 లేదా181కు కాల్ చేయాలని రవాణా శాఖ ఆర్టీసీ డిపో మేనేజర్లకు, అందరూ ఆర్టీసీ సిబ్బందికి సూచించాలని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, మున్సిపల్, దేవాదాయ శాఖ, స్వయం సహాయక సంఘాలు సమన్వయంతో పిల్లల సమాచారాన్ని అందించాలని వారి భవిష్యత్తు కోసం సహకరించాలని సూచించారు. బాల కార్మిక చట్టం అమలు కోసం లేబర్ ఆఫీసర్ తప్పనిసరిగా అన్ని ఎస్టాబ్లిష్మెంట్లను తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీ రాజం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, సభ్యులు ఖాజా, ఐసీపీఎస్ మిషన్ వాత్సల్య సిబ్బంది కవిత, అంజయ్య గగన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

గంభీరావుపేట,ప్రభాతవార్త:



గంభీరావుపేట మండలం ముస్తఫా నగర్ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ లో భాగంగా భక్తుల సౌకర్యార్థమై ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఈ సందర్భంగా తెలిపారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండ సుకన్య, ఉప సర్పంచ్ శివంది దేవేందర్, వార్డు సభ్యులు కృష్ణ కాంత్ యాదవ్, బండ రమేష్, వీరబోయిన రమేష్, , ఆలయ కమిటీ గౌరీ గారి నాగరాజ్ గౌడ్, సభ్యులు ప్రసాద్ ప్రసాద్ రావు, బండ రవి, శివరాత్రి నర్సింలు లతోపాటు పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



ఇల్లంతకుంట మండల కేంద్రములోని వైశ్యభవన్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం జరిగిన వివాహ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన చేరాల సత్తయ్య సరిత దంపతుల కుమారుడు చేరాల రాహుల్ రూప వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచులు రాజు, నేరెళ్ల విజయ్ గౌడ్, నాయకులు గుడిసె ఐలయ్య, వుట్కూరి రమణారెడ్డి, అంతగిరి వినయ్ కుమార్, పసుల వెంకటి, చేరాల వంశీకృష్ణ, చేరాల ప్రభాకర్, చేరాల మనోహర్ ఉన్నారు.

అనంతారంలో పశువులకు టీకాలు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలములోని అనంతారం గ్రామములో పశువులకు శుక్రవారం లంపి వైరస్ నిరోధక టీకాలు వేశారు. సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేష్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ గ్రామ రైతుల పశుసంపదను రక్షించే క్రమములో లంపీ స్కిన్ వైరస్ నివారణ టీకాల కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలోని ఆవులు, లేగ దూడలకు రైతులు ఉచితంగా నిరోధక టీకాలు వేయించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి పూర్ణచంద్రిక, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు చిట్టి వెంకట రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే విధానం పాటించాలి

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త:

ప్రతి శుక్రవారం డ్రై డే విధానం పాటించాలి జిల్లా వైద్య ఆరోగ్య శాకాధికారి ఎంజేలాఅల్ఫ్రేడ్ అన్నారు. ప్రజలకు ప్రతి శుక్రవారం డ్రై డే విధానం పాటించేలా అవగాహన కలిగించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.ఎంజేలా అల్ఫ్రేడ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని శాంతి నగర్ ను సందర్శించి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తప్పని సరిగా ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి మురుగు గుంతలను పూడ్చివేయాలని, నీరు ఎక్కువగా నిల్వవున్న కుంటలలో ఆయిల్ బాల్స్ కానీ, కిరస నాయిల్ వేయాలని సూచించారు. కొబ్బరిబొండాలు, పాడై పోయిన టైర్లు, మొదలగువాటిని ఇంటి చుట్టూ ప్రక్కల వుంచకుండా చూడాల అన్నారు. రానున్న వర్షాకాలము లో అంటువ్యాధులు ప్రబలకుండా చూసుకోవడాని ముందస్తు ప్రణాలికలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. రానున్న వర్షాకాలము సీజన్ లో సిబ్బంది అందుబాటులో వుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది రమేష్, ఆశా వర్కర్ నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు



సిరిసిల్ల వార్త

రైతులను ముంచుతున్న రేవంత్ సర్కార్

మండల బిఆర్ఎస్ నాయకులు కొమ్మెటరాజు

ముస్తాబాద్ ప్రభాత వార్త:



రైతులను ముంచుతున్న రేవంత్ సర్కార్ అని మండల బిఆర్ఎస్ నాయకులు కొమ్మెటరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రెండు లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేదని, యూరియా యాప్ పేరుతో రైతులను హరి గోస పెడుతున్నాడని, రైతులకు సరిపడ కరెంట్ ఇవ్వడం లేదని, బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కెసిఆర్ ముందస్తుగా 6 నెలల ముందే యూరియా, దుక్కి రైతులకు అందించేవాడని, ప్రమాదవశాత్తు ఎవరైనా చనిపోతే 5 లక్షల భీమా ఇచ్చేవాడని, మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని త్వరలో గద్దె దించి, కెసిఆర్‌ను మళ్ళీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని ఈ సందర్భంగా అన్నారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా మునిగేల బాధ్యతలు స్వీకరణ

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త



తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మునిగేలా రాజు బాధ్యతలు స్వీకరించారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రాజు కు పూలమాలు వేసి శాలువాతో సన్మానించి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మునిగల రాజు మాట్లాడుతూ తన పై పార్టీ అధిష్ఠానం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తూ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రత్యేకంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే తన ప్రధాన లక్ష్యమని రాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిఆర్ఎస్ నేత రామ్మోహన్ బర్త్డే వేడుకలు

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త



తంగళ్ళపల్లి మండలం నేరెళ్ల గ్రామంలోని ప్రీ ప్రైమరీ పాఠశాలలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు బొల్లి రామ్మోహన్ పుట్టినరోజు వేడుకలను బిఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. రామ్మోహన్ బర్త్డే ను పురస్కరించుకొని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు పండ్లను పంపిణీ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నమిలికొండ అంజి, మాజీ ఎంపీటీసీ మీసాల కళా క్రిష్ణ, శ్రీకాంత్ రావ్, అఖిల్, దాసరి రాజు, బట్టు రవి, రడం అంజి, రడం చరణ్, గణేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ పరిధిలోని ధర్మారం, తక్కళ్లపల్లి, పోలాస, జాబితాపూర్ గ్రామాల్లో లబ్ధిదారులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై,లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ధర్మారం గ్రామ సర్పంచ్ పరుమాల సుమలత మల్లేష్‌తో పాటు పలువురు లబ్ధిదారుల ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే,వారికి ప్రత్యేకంగా చీరలను కానుకగా అందజేసి ఆశీస్సులు అందజేశారు.ఈ కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షులు గజంగి నందయ్య,ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, ఎంపీఓ రవిబాబు,సర్పంచుల జిల్లా ఫోరం అధ్యక్షులు బొలిశెట్టి గంగారెడ్డి,



సర్పంచులు మిల్కూరి శంకర్,వడ్లూరి లక్ష్మీ,శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచులు అంకం సతీష్,నారాయణ రెడ్డి,చిర్ర నరేష్,హనుమాన్ రెడ్డి,మహేశ్వర్ రావులతో పాటు స్థానిక నాయకులు జయరాం సురేష్, సత్తిరెడ్డి, హరీష్,రాజా గౌడ్,ధనేశ్వర రావు, సూర్య ప్రకాష్,కృష్ణ,కందుల శేఖర్,గంగారం, తిరుపతి,రాజు,మహేష్,రమేష్, సతీష్,వివిధ వార్డుల సభ్యులు, పలువురు ప్రభుత్వ అధికారులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర సంక్షేమ పథకాలను సీఎస్‌సీ డిజిటల్ సేవ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తేవాలి

ఎంపీ ధర్మపురి అరవింద్‌కు వినతి

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త:



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజా సేవలను కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) డిజిటల్ సేవా కేంద్రాల ద్వారా డిజిటలైజేషన్ చేసి గ్రామీణ ప్రజలకు చేరువ చేయాలని తెలంగాణ సీఎస్‌సీ వీఎల్‌ఈ డిజిటల్ సేవా సొసైటీ (టీసీవీడీఎస్ఎస్) ప్రతినిధులు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ కు వినతిపత్రం సమర్పించారు.జగిత్యాల జిల్లాలో నిర్వహించిన 'దిశ' కార్యక్రమానికి హాజరైన ఎంపీ అరవింద్‌ను శుక్రవారం కలిసి సొసైటీ ప్రతినిధులు తమ సమస్యలు, సూచనలను వివరించారు. ఈ సందర్భంగా టీసీవీడీఎస్ఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 13 వేలకుపైగా సీఎస్‌సీ డిజిటల్ సేవా కేంద్రాలు గ్రామీణ స్థాయిలో ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలను అందిస్తున్నాయని తెలిపారు.గత 11 సంవత్సరాలుగా సీఎస్‌సీ కేంద్రాల ద్వారా జాతీయ డిజిటల్ అక్షరాస్యత మిషన్, ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ కింద ఉచిత కంప్యూటర్ శిక్షణ, జాతీయ ఫైబర్ నెట్‌వర్క్ అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సర్వేలు, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్-రాజీవ్ ఆరోగ్యశ్రీ, జాతీయ ఉపకార వేతన పథకం, ఆధార్ నవీకరణ సేవలు, ప్రధానమంత్రి విశ్వకర్మ, ఈ-శ్రమ్, ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్, కిసాన్ మాన్‌ధన్, డిజిపే సేవలు, పంటల బీమా పథకం, పోషణ ట్రాకర్, ప్రధానమంత్రి కిసాన్, టెలి లా, పశు వైద్య, ఆరోగ్య సేవలు, జాతీయ పెన్షన్ వ్యవస్థతో పాటు కేంద్ర ప్రభుత్వానికి చెందిన అనేక ప్రజా సంక్షేమ సేవలను అందిస్తున్నామని వివరించారు.అయితే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజా సేవలు ఇప్పటికీ సీఎస్‌సీ డిజిటల్ సేవా కేంద్రాల్లో అందుబాటులో లేవని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల దరఖాస్తు ప్రక్రియను సీఎస్‌సీ వ్యవస్థలో అనుసంధానం చేస్తే గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత సులభంగా సేవలు అందుతాయని, ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు అవకాశం ఉంటుందని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.కేంద్ర ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రజా ప్రయోజన సేవలను కూడా సీఎస్‌సీ కేంద్రాల ద్వారా అందించే అవకాశం కల్పించాలని టీసీవీడీఎస్ఎస్ ప్రతినిధులు కోరారు. ఈ అంశాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టాలని ఎంపీ అరవింద్‌ను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ వీఎల్‌ఈ నిర్వహకులు గణేష్, రఘుపతి రెడ్డి, మనోహర్, సురేష్, స్వామి, మల్లేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్.) 2026పై సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్.) 2026 కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్లకు అవగాహన కల్పించడంతో పాటు ఎన్యూమరేషన్ ఫారం నింపడంపై సందేహాల నివృత్తి కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ఓటర్లు తమ ఓటరు జాబితాలో నమోదైన వ్యక్తిగత వివరాలు, సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో), బీఎల్‌వో సూపర్‌వైజర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్‌వో), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌వో) వివరాలతో పాటు ఎన్యూమరేషన్ ఫారం నింపే విధానంపై ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను లేదా హెల్ప్‌లైన్ నంబర్ 7989193131ను సంప్రదించి అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.ఎస్.ఐ.ఆర్. 2026 ప్రక్రియలో ప్రతి అర్హత కలిగిన ఓటరు చురుకుగా పాల్గొని, తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైతే ఎన్యూమరేషన్ ఫారాన్ని సక్రమంగా నింపి సమర్పించాలని కలెక్టర్ కోరారు. ఓటర్లకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం అందించేందుకు హెల్ప్ డెస్క్ ద్వారా అధికారులు అందుబాటులో ఉంటారని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పొలాసలో 68 తెల్ల పశువులకు ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాలు

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల మండలం రూరల్ పొలాస గ్రామంలో పశువైద్య పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఉచిత ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో భాగంగా గ్రామానికి చెందిన 68 తెల్ల పశువులకు ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాలను వేయడం జరిగింది.ఈ సందర్భంగా తెల్ల పశువుల పాడి రైతులను ఉద్దేశించి పశువైద్య అధికారులు మాట్లాడుతూ, ముద్ద చర్మ వ్యాధి అనేది సూక్ష్మ సూక్ష్మమైన వైరస్ వల్ల సోకుతుందని వివరించారు. ముఖ్యంగా పశువుల పాకలలో ఉండే గోమార్లు, పిరుదులు,ఈగలు,దోమల కాటు వల్ల ఈ వ్యాధి ఒక పశువు నుండి మరొక పశువుకు వేగంగా వ్యాప్తి చెందుతుందన్నారు.ఈ వ్యాధి బారిన పడిన పశువులు అధిక జ్వరంతో పాటు శరీరంపై ముద్దలు,పొక్కులు వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురవుతాయని పేర్కొన్నారు.వ్యాధి సోకిన పశువులకు తక్షణ ఉపశమనం కోసం యాంటీబయోటిక్ ఇంజక్షన్లు,పారాసెటమాల్ ఇంజక్షన్లు,ఆయింట్‌మెంట్లు వాడాల్సి ఉంటుందని తెలిపారు.పాడి రైతులు అప్రమత్తంగా ఉండి,తమ పశువులకు ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి రక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని సూచించారు.ఈ ఉచిత టీకాల కార్యక్రమంలో ఇన్‌చార్జి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ తిరుపతి గౌడ్, పొలాస వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్,ఆఫీస్ సబార్డినేట్ అనిత,రాధా కిషన్,గ్రామ సర్పంచ్ మిల్కూరి శంకరయ్య,ఉప సర్పంచ్ తిరుపతి,స్థానిక పాడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జగిత్యాల వార్త

ఎంపీ అరవింద్ ధర్మపురిని కలిసిన బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నారపాక అశోక్

బీర్‌పూర్ ప్రభాత వార్త



జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలానికి చెందిన నాయకులు నారపాక అశోక్ జగిత్యాల జిల్లా ఎస్సీ మోర్చా నూతన అధ్యక్షుడిగా నియమితులైన అనంతరం మొదటిసారిగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) అరవింద్ ధర్మపురిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌కు విచ్చేసిన ఇందూర్ టైగర్, పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి నీ నారపాక అశోక్ కలిసి శాలువాతో సత్కరించారు. బీర్పూర్ మండల పరిధి నుంచి జిల్లా స్థాయి బాధ్యతలు చేపట్టిన నారపాక అశోక్‌కు ఎంపీ అరవింద్ ధర్మపురి ఈ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.జిల్లా వ్యాప్తంగా ఎస్సీ మోర్చాను బలోపేతం చేయడంతో పాటు, బీర్పూర్ మండలంలోనూ పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీ ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి అప్పగించినందుకు, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వేళ తనను ఆశీర్వదించినందుకు ఎంపీ అరవింద్ ధర్మపురికి నారపాక అశోక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీర్పూర్ మండల బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిని ఇంట్లోంచి గెంటేసిన కర్కశ కొడుకు

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త:



ఎండపల్లి మండలం కొత్త పేట గ్రామానికి చెందిన గంగధరి లక్షి మ్మ (85)అనే వృద్ధురాలిని తన కన్న కొడుకు రాజేశం ఇంట్లోంచి గెంటి వేశాడని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించింది.ఈ మేరకు ఆ వృద్ధ తల్లి సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయం తో ఆర్డీవో కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి కోట వసంత కు ఫిర్యాదు చేయగా తల్లి దండ్రుల రక్షణ పోషణ చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం అ వృద్ధ తల్లి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో విలేకరులకు తన గోడు వినిపిస్తూ రోదించారు . తన 5వ కొడుకు రాజేశం నేను స్వయంగా నిర్మించుకున్న ఇంట్లోంచి బలవంతం గా వెళ్ల గొట్టాడని, నా పోషణ కూడా చూసుకోకుండా నా పేరిట ఉన్న పట్టాభూములను తన పేరిట పట్టా చేయాలని హింసిస్తున్నాడని, నేను దత్తత ఇచ్చిన కొడుకు సురేందర్, కూతురు ప్రమీల నా గోస చూసి ఆశ్రయమిస్తే నన్ను సంరక్షణ చేయవద్దని వారిని బెదిరిస్తున్నాడని, నన్ను ఇంట్లోంచి కొట్టి వెళ్ల గొట్టిన కొడుకు రాజేశంను నా ఇంటి నుంచి వెళ్ల గొట్టి నన్ను నా ఇంటిలో ఉంచాలని, నా ముగ్గురు కొడుకులైన ప్రతాప్, రవీందర్, రాజేశంలు నాకు పోషణ ఖర్చు ల కింద ఒక్కొక్కరి నుంచి నెలకు రూ. 5 వేలు చొప్పున నా బ్యాంకు ఖాతాలో జమ చేయించాలని సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు , సీనియర్ న్యాయవాది హరి అశోక్ కుమార్, వారి బృందం సహకారంతో ఆర్డీవో కు ఫిర్యాదు చేశానని, తనను ఇంటిలో నుంచి వెళ్ళగొట్టిన కొడుకు రాజేశంపై జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశానని ఆ వృద్ధురాలు ఏడుస్తూ తెలిపింది. వృద్ధురాలి వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు సీనియర్ న్యాయవాది హరి అశోక్ కుమార్,వృద్ధుల సంరక్షణ కాన్సిలియేషన్ అధికారి పి. సి. హన్మంత్ రెడ్డి, వృద్ధురాలి కూతురు ప్రమీల, సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం, సాధికారతకు కేంద్రం పెద్దపీట : బండి

తిమ్మాపూర్,ప్రభాత వార్త :

మహిళా సంక్షేమం, ఆర్థికాభివృద్ధి సాధికారతకు మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని మహిళా ప్రాంగణంలో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కేంద్రం పాటుపడుతోందని, ఉజ్వల పథకంలో భాగంగా 11 కోట్ల గ్యాస్ కనెక్షన్లు మహిళలకు ఇచ్చామని చెప్పారు. త్వరలో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు తీసుకు వస్తామన్నారు. స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా మహిళలకు విడుతల వారీగా ఆటోలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు. గూడ్స్ ఆటోలు మన కరీంనగర్ లో మాత్రమే నడుస్తున్నాయని, వీటికి మరింత డిమాండ్ పెరిగే అవకాశాలున్నాయన్నారు. అన్నిరంగాల్లో మహిళలను ప్రోత్సహించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు మంచి చేయాలని చూస్తుందని, అయితే గత పాలకులు మాత్రం ఇందుకు భిన్నంగా పని చేశారని, గత పాలకులకు మహిళలను ప్రోత్సహించాలన్న సోయి లేకుండా పోయిందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 20 వేల మంది విద్యార్థులకు సైకిళ్లు కొని ఇవ్వడమే కాకుండా పదో తరగతి చదివిన విద్యార్థులకు పరీక్ష ఫీజులు కట్టిన విషయాన్ని బండి సంజయ్ కుమార్ గుర్తు చేశారు.

మహిళల స్వావలంభనే సర్కార్ ధ్యేయం :

డాక్టర్ కవ్వంపల్లిఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎవరిపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించేలా మహిళలను తీర్చిదద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని చెప్పారు. మహిళా సంఘాలకు రూ.10లక్షల రుణంతో పాటు ఇన్సూరెన్స్ కల్పిస్తున్నామని డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. మహిళల్లో కష్టపడే తత్వం మెండుగా ఉండటం వల్ల ప్రభుత్వ పథకాలతో వారు సత్ఫలితాలను సాధిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు,కార్యక్రమాలన్నీ మహిళా ప్రాంగణం ద్వారా ప్రవేశపెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.మహిళలను బలోపేతం చేసేలా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అందిస్తున్న సహాయం, చేస్తున్న కృషి ఎంతో గొప్పదని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు.



బైపాస్ రోడ్డే కావాలి అభిప్రాయ సేకరణలో గ్రామస్తుల వెల్లడి

పాత 33 ఫీట్లకు ఓకే, కొత్తగా 40 ఫీట్లకు కష్టం

చిగురుమామిడి, ప్రభాత వార్త :

కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వరకు నిర్మాణం కాబోతున్న నాలుగు లైన్ల ప్రధాన రహదారి పనుల నిమిత్తం శుక్రవారం రోజున చిగురుమామిడి మండల కేంద్రం లోని గ్రామపంచాయతీ ఆవరణంలో ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన అభిప్రాయ సేకరణలో గ్రామస్తులు పలు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గ్రామస్థులు మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రామం లో ఉన్న 33 ఫీట్ల రోడ్డు అయితే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, కొత్తగా 40 ఫీట్లు అంటే మాత్రం కచ్చితంగా ఒప్పుకునే ప్రసక్తి లేదని, కుదరకపోతే బైపాస్ రోడ్డు గ్రామం వెలుపల నుంచి వేసుకోవచ్చని తెలిపారు. రోడ్డు వెడల్పులో భాగంగా ఇండ్లు కోల్పోతున్న బాధితులతోతహసీల్దార్, ఆర్ అండ్ బి ఏఈ, గ్రామ సర్పంచ్ గార్లు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం అందరూ ఏకాభిప్రాయంనకు రావాలని, ఈ గ్రామ సభలో మీ మీ అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించే వేదిక ఇది అని, ఇందులో ఎటువంటి బలవంతం లేదని తెలిపారు. కొందరు బాధితులు మాట్లాడుతూ ఈ నాలుగు లైన్ల ప్రధాన రహదారి రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా ఎన్నో ఏళ్లుగా తాము ఏర్పాటు చేసుకున్న నివాసాల్ని కోల్పోతున్నామని, దీనికి ప్రభుత్వం ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండానే, నివాస ఆధారం చూపెట్టకుండానే కూల్చే విధమైనటువంటి పనులు చేస్తే ఊరుకునేది లేదని, నిరసన కార్యక్రమాలు చేపడతామని డిమాండ్ చేశారు. కనీసం ఇల్లు కోల్పోయే బాధితులకు నష్టపరిహారం లేదా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ప్రొసిడింగ్ కాపీలను వెంటనే అందజేసిన తర్వాత మాత్రమే పనులు మొదలు పెట్టాలని మరో కోరారు. మరో కొంతమంది బైపాస్ వద్దని గ్రామంలో నుంచే రోడ్డు వేయాలని అధికారులకు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. గ్రామస్తులు తెలిపిన అభిప్రాయాల ప్రకారం నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకవరం భవాని, తహసీల్దార్ కే కనకయ్య, ఎస్సై బి జగదీశ్వర్, ఆర్ అండ్ బి ఏ ఈ సురేష్, ఉప సర్పంచ్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కె రమేష్, జిపిఓ రమేష్ రెడ్డి, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కవ్వం పల్లి చరిత్ర హీనుడు మాజీ ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్,ప్రభాత వార్త :

తాను దళిత సంఘ నాయకులతో కలిసి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని అంబేద్కర్, జగ్జీవన్ రావ్ విగ్రహాలను ఆవిష్కరిస్తే.. అధికార మదంతో మళ్లీ ముసుగు వేయించిన దళిత ఎమ్మెల్యే చరిత్ర హీనుడు కవ్వంపల్లి సత్యనారాయణ అని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఓ వీడియో వదిలారు. వీడియోలో మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో దళిత సంఘాల నాయకులు కోరడంతో బస్టాండ్ ను వాడుకలోకి తెచ్చి విగ్రహాలను ఏర్పాటు చేశానన్నారు. తర్వాత కొన్ని పరిస్థితుల వల్ల ఆవిష్కరణ ఆలస్యమైందని, అంతలోనే కోడ్ రావడంతో ఆగిందన్నారు. రాజకీయాలకు తావు లేకుండా అన్ని వర్గాలను కలుపుకొని అద్భుతంగా చేద్దామనుకున్నామని చెప్పారు. అయితే ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ గెలిచి మూడేళ్లయిన విగ్రహాలను ఆవిష్కరించకుండా ఉండడంతో.. తామే మంత్రిని కలిసి అనుమతులు ఇవ్వాలని కోరడంతో.. వెంటనే తేరుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి పర్మిషన్ తెచ్చానని సన్మానం చేయించుకున్నాడని గుర్తు చేశారు. ఇది జరిగి మూడు, నాలుగు నెలలు అవుతున్న మళ్లీ అలాగే ఉండడంతో విగ్రహాలు పెట్టిన తానే గురువారం ఆవిష్కరించానని, వెంటనే అధికారులను బలగాలను పంపించి పనులను నిలిపివేసి మళ్ళీ ముసుగులు వేశారన్నారు. ఆవిష్కరణలు జరిగిన విగ్రహాలకు ఎక్కడైనా ముసుగులు వేస్తారా అని ప్రశ్నించారు. ముసుగులు వేయించిన చరిత్రహీనుడు కవ్వంపల్లి అని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గ్రామ గ్రామాన అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేశానని, మండలానికో అరుంధతి కళ్యాణ మండపాన్ని నిర్మించామని అన్నారు. ఆవిష్కరించిన విగ్రహాలకు ముసుగులు వేయించిన నీకు ప్రజలు ముసుగులు వేసే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. అంబేద్కర్ తో ఆటలొద్దని హితవు పలికారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ.

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక మండలము లో నీ పోతిరెడ్డి పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం గ్రామ వాస్తవ్యులు డాక్టర్ పరిపాటి శరత్ కుమార్ రెడ్డి,రూప దంపతులు,వారి కుమారుడు ఆశ్రయ రెడ్డి లు క్రీడా దుస్తులు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆశలకు రెక్కలు తొడిగి,ఉన్నతాశయాలు సాధించాలని,జీవితములో విజయవంతమైన వ్యక్తిగా క్రీడలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని,అందుకే విద్యార్థులందరికీ క్రీడా దుస్తులు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ క్రీడలవలన శారీరక దారుఢ్యం,మానసిక వికాసం రెండు జరిగి సంపూర్ణత సాధించ వచ్చన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గజ్జెల మొగిల య్య,ఉప సర్పంచ్ రాపర్తి సంధ్య,ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.



కరీంనగర్ వార్త

ఈవీఎం గోదామును తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:

కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదామును శుక్రవారం అదనపు కలెక్టర్ రెవెన్యూ డి.శ్రీనివాస్ రెడ్డి, రాజకీయ పార్టీ ప్రతినిధిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్



రెవెన్యూ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవీఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవియం గదుల వి వి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసిల్దార్ రాజేష్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థలో న్యాయవాది పాత్ర కీలకం...

రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రఘునాథ్

కరీంనగర్ లీగల్, ప్రభాతవార్త:

న్యాయవ్యవస్థలో న్యాయవాది పోషించే పాత్ర కీలకమైనదని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రఘునాథ్ తెలిపారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టులో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ పై నిర్వహించిన సెమినార్ కు ఆయన



ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు న్యాయం అందించటంలో వారి రాజ్యాంగ హక్కులు కాపాడటంలో న్యాయవాదులు ముందుంటారని తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా బెదిరింపులు దాడులు తప్పుడు కేసులను న్యాయవాదులు ఎదుర్కొంటున్నారని ఈ పరిస్థితులలో తెలంగాణ ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టం 2026ను ఈ ఏడాది జూన్ నుండి అమలులోకి తెచ్చిందని తెలిపారు. ఈ చట్టంతో న్యాయవాదులు నిర్భయంగా విధులు నిర్వహించగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. న్యాయవాదుల రక్షణ చట్టం గూర్చి అవగాహన కలిగించారు. అనంతరం అసోసియేషన్ రఘునాథ్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండ శివకుమార్, బొడ్ల గీతారాణి, సంయుక్త కార్యదర్శి సుంకే దేవకిషన్, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శి బెజ్జంకి శ్రీకాంత్, న్యాయవాదులు పాల్గొన్నారు.



కళ్ళుండి చూడలేని వ్యక్తి కౌశిక్ రెడ్డి...

వొడితల ప్రణవ్.

హుజురాబాద్ లో సర్ పై విస్తృతంగా అవగాహన కార్యక్రమం.

జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త:

సమగ్ర ఓటు సవరణలో ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును కాపాడుకోవాలని, దానికి సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బిఎల్ఓ, బిఎల్ఏలను సంప్రదించాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కోరారు. శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణంలోనీ 14,17 వార్డులలో సర్ పై ఇంటి ఇంటికి తిరుగుతూ సవరణ ప్రక్రియ గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీహార్,పచ్చిమ బెంగాల్ లో జరిగినట్టు ఇక్కడ కూడా ఓట్ల తొలగింపు కార్యక్రమం పేరుతో నిజమైన ఓటర్లను తొలగించకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు ఈ సవరణ ప్రక్రియ కార్యక్రమంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.దీనికి వార్డ్ కో ఆర్డినేటర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు ఓటర్లకి అవగాహన కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలు కళ్ళ ముందు కనిపిస్తుంటే, గ్యారంటీల్లో ఒక్కటైన ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశానికి స్వయంగా కౌశిక్ రెడ్డి వెళ్ళి రిబ్బన్ కట్ చేస్తున్నాడని ఇది కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పనితీరు అని,200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఉచిత బస్, రుణమాఫీ,రైతు భరోసా, రాజీవ్ ఆరోగ్య శ్రీ 10లక్షలకు పెంపు, మహిళా సాధికారతకు భరోసా ఇస్తూ వారికి వడ్డీలేని రుణాలు ఇచ్చామని, అంతే కాకుండా వైద్య విషయంలో ముందుండాలని ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల కోసం 30 లక్షలు, డయాలసిస్ సెంటర్ లు మంజూరు చేయించామని, ఇల్లందుకుంటలో నూతన రెవెన్యూ భవనం మంజూరు చేయించామని అన్నారు. 2న్నర ఏండ్లు ఎమ్మెల్సీ, విప్ గా ఉన్న కౌశిక్ రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉన్నా కూడా ఇవి ఎందుకు చేయలేదని అన్నారు. ఇప్పుడిస్తున్న కళ్యాణ లక్ష్మీ , సీఎంఆర్ఎఫ్ చెక్కులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్నవే అని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మొలుగూరి సదయ్య, మహమ్మద్ సజ్జు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్ హుజురాబాద్ కో ఆర్డినేటర్, పట్టణ, మండల అధ్యక్షులు, వార్డ్ కో ఆర్డినేటర్లు, సీనియర్ నాయకులు పలువురు పాల్గొన్నారు.



గతంలో అధికారంలో ఉండి చేయలేని కౌశిక్ రెడ్డి....

-- నేడు ఇందిరమ్మ ఇళ్లకు రిబ్బన్లు కట్ చేస్తున్నారు

-- వొడితల ప్రణవ్ ఫైర్

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త:

హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు కళ్ళ ముందే కనిపిస్తున్నా... స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కళ్ళుండి చూడలేని వ్యక్తిలా వ్యవహరిస్తున్నారని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని 14, 17 వార్డులలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (సర్) పై ప్రణవ్ విస్తృతంగా ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీహార్, పశ్చిమ బెంగాల్



రాష్ట్రాల్లో జరిగినట్లు ఇక్కడ కూడా ఓట్ల తొలగింపు ప్రక్రియ పేరుతో నిజమైన ఓటర్ల హక్కులు కోల్పోకుండా ఉండాలంటే, ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు సవరణ ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్ఓ, బీఎల్ఏ లను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ బాధ్యతను వార్డ్ కో ఆర్డినేటర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు ముందంజలో ఉండి ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగమైన ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశానికి స్వయంగా కౌశిక్ రెడ్డే వెళ్లి రిబ్బన్ కట్ చేస్తున్నారని, ఇది కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల విజయవంతమైన పనితీరుకు నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో రెండున్నరేళ్లు ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్ గా ఉండి, నాడు అధికారంలో ఉన్నా చేయలేని పనులను, నేడు తాము అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే చేసి చూపిస్తున్నామని ప్రణవ్ స్పష్టం చేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రుణమాఫీ, రైతు భరోసా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంపు, మహిళా సాధికారతకు వడ్డీ లేని రుణాలు అందించడం వంటి అనేక కాంగ్రెస్ ప్రభుత్వం దిగ్విజయంగా అమలు చేస్తోందని గుర్తుచేశారు. వీటితో పాటు నియోజకవర్గ వైద్యరంగ బలోపేతానికి, ఆసుపత్రులలో మౌళిక సదుపాయాల కోసం రూ. 30 లక్షలు, డయాలసిస్ సెంటర్లను మంజూరు చేయించామని, ఇల్లందుకుంటలో నూతన రెవెన్యూ భవనాన్ని ఏర్పాటు చేయించామని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో పంపిణీ చేస్తున్న కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్నవేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్ హుజూరాబాద్ కో ఆప్షన్ కో ఆర్డినేటర్, పట్టణ, మండల అధ్యక్షులు, వార్డ్ కో ఆర్డినేటర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సహకార సంఘం ఎన్నికల్లో రెండో రోజు జోరుగా నామినేషన్లు...

కమలాపూర్, మర్రిపల్లిగూడెంలో పోటాపోటీ...

గోపాల్‌పూర్‌లో మాత్రం నామినేషన్ దాఖలు నిల్....

కమలాపూర్: ప్రభాతవార్త.

కమలాపూర్ మండల వ్యాప్తంగా చేనేత సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. రెండో రోజు నామినేషన్ల పర్వం పోటాపోటీగా సాగుతుండగా, కొన్ని చోట్ల ఏకగ్రీవాలకు కూడా ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.కమలాపూర్ మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘానికి రెండో రోజు ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఇప్పటివరకు మొత్తం నామినేషన్ల సంఖ్య 17కి చేరింది. ఇక్కడ పోటీ తీవ్రంగా ఉండే అవకాశం కనిపిస్తోంది.ఇక మర్రిపల్లిగూడెం చేనేత సహకార సంఘానికి రెండో రోజు ఏకంగా 14 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి రోజుతో కలిపి ఇప్పటివరకు మొత్తం 20 మంది బరిలో నిలిచారు. ఇక్కడ కూడా పదవుల కోసం గట్టి పోటీ నెలకొంది.అయితే గోపాల్‌పూర్ చేనేత సహకార సంఘంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. మొదటి రోజు మాదిరిగానే రెండో రోజు కూడా గోపాల్‌పూర్‌లో నామినేషన్ దాఖలు కాలేదు. దీంతో ఇక్కడి నేతన్నల్లో ఎన్నికలపై ఆసక్తి తగ్గిందా అనే చర్చ మొదలైంది.ఈ ఎన్నికల్లో హనుమకొండ జిల్లాలోనే తొలి ఏకగ్రీవంగా హాసన్‌పర్తి చేనేత సహకార సంఘం నిలిచింది. సంఘం నూతన అధ్యక్షుడిగా మాటేటి భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఇతర సంఘాల్లో కూడా ఏకగ్రీవ ఎన్నికల కోసం పద్మశాలి సంఘం నేతలు కృషి చేస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత ఏ సంఘాల్లో పోటీ ఉంటుంది, ఎక్కడ ఏకగ్రీవం అవుతుందనేది తేలనుంది.



ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు మృతి..

నివాళులు అర్పించిన ఎమ్మెల్యే పాడి..

జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అయిత మహేష్ (52) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మరణవార్త జమ్మికుంట పట్టణంలో విషాదాన్ని నింపింది. జమ్మికుంట పట్టణంలో ప్రముఖ వ్యాపారిగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా, మున్సిపల్ కౌన్సిలర్ గా అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో సేవలు అందించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న హుజూరాబాద్ బిఆర్ఎస్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మెన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, పింగళి రమేష్, పొనగంటి సంపత్ లు మహేష్ పార్థివ దేహంపై పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మహేష్ మృతికి పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు బచ్చు వీరలింగం, బచ్చు భాస్కర్, ముక్క శివ కుమార్, గర్రెపల్లి రాజమౌళితో పాటు పలువురు నివాళులు అర్పించారు. మహేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ నేత ప్రణవ్..

ఇల్లందుకుంట, ప్రభాతవార్త:

ఇల్లందకుంట మండలం బోగంపాడ్ గ్రామంలో జరుగుతున్న శ్రీ భూలక్ష్మీ , మహాలక్ష్మి , నాభిశిల(బొడ్రాయి), పోచమ్మ, మధునమ్మ తల్లుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ గారు హాజరయ్యారు. శుక్రవారం గ్రామ ప్రజలు ప్రణవ్ కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు పలువురు పాల్గొన్నారు.



జర్నలిజం కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

హుజూరాబాద్ టౌన్, ప్రభాత వార్త:

హుజూరాబాద్ పట్టణంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో బిఏ జర్నలిజం కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వల్లూరి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో హుజూరాబాద్ రీజియన్ లో జర్నలిజం కోర్సును నిర్వహిస్తున్న మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో జర్నలిజం కోర్సుకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు వారు తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు, ఓపెనింగ్ ఇంటర్ పూర్తి చేసిన వారు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతోనే ఈ కోర్సును నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. రిపోర్టింగ్, యాంకరింగ్, న్యూస్ రీడర్, డెస్క్ ఆపరేటర్స్, ఎడిటర్, సబ్ ఎడిటర్, అడ్వర్టైజింగ్ వంటి రంగాలలో ఆసక్తి కలిగిన అభ్యర్థులు కళాశాలలో సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చని వారు సూచించారు. మరింత అదనపు సమాచారము కొరకు 9440514629 ఫోన్ నెంబర్ కు సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

కట్టు దిట్టంగా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలనుఅమలు చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రజలకు సురక్షి తమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పరిశుభ్రత, వడ్డింపు వంటి అన్ని అంశాల్లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేసే సిబ్బందికి ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, వినియోగదారుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసి, అవసరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం మాత్రమే తిరిగి నిర్వహణకు అనుమతులు ఇస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి నిరక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. మే 29న మంథని మార్కెట్ ప్రాంతంలోని శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్, జూన్ 13న గోదావరిఖనిలోని డెస్టినేషన్ రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి



ఆయా రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలిపారు. తదనంతరం ఆయా సంస్థల నిర్వాహకులు పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేపట్టడంతో, ఫుడ్ సేఫ్టీ అధికారుల పునఃపరిశీలన అనంతరం శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్‌కు జూన్ 4న, డెస్టినేషన్ రెస్టారెంట్‌కు జూన్ 30న తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఇతర హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఎక్కడైనా అపరిశుభ్రత లేదా నిబంధనల ఉల్లంఘన గుర్తించిన వెంటనే సంబంధిత సంస్థలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించాలని లిజిల్లా కలెక్టర్‌లి ప్రకటన లో పేర్కొన్నారు.

రాబోయే రోజుల్లో పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు విస్తరిస్తాం

మున్నూరు కాపు సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు జడల సురేందర్

ఇల్లు కూలిన నిరాశ్రయులకు ఆర్థిక సహాయం అందజేత



పెద్దపల్లి, ప్రభాతవార్త: రాబోయే రోజుల్లో పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు విస్తరిస్తామని మున్నూరు కాపు సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు జడల సురేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ రాజయ్య స్పష్టం చేశారు. శుక్రవారం అందుగులపల్లి గ్రామంలో గత జూన్ నెలలో కురిసిన అకాల వర్షాల వల్ల కామ వెంకన్న, సుగుణల ఇల్లు పూర్తిగా కూలిపోయి నిరాశ్రయులైన ఘటనపై జడల సురేందర్ ఆధ్వర్యంలో సంఘం తక్షణమే స్పందించి, సభ్యుల గ్రూప్ ద్వారా సుమారు 35000 రూపాయల ఆర్థిక సహాయాన్ని సేకరించారు. ఈ నిధులతో బాధితులకు ఇల్లు సరిచేసుకోవడానికి అవసరమైన రేకులు ఇప్పించడంతో పాటు, మిగిలిన 6000 రూపాయల నగదును ఆయన చేతుల మీదుగా బాధితులకు నేరుగా అందజేశారు. విపత్కర పరిస్థితుల్లో కుల బాంధవులను ఆదుకోవడానికి మున్నూరు కాపు కుల బంధువులంతా పెద్ద మనసుతో స్పందించడం అభినందనీయమని జడల సురేందర్ కొనియాడారు. రాబోయే రోజుల్లో పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన నిరుపేద మున్నూరు కాపు కుటుంబాలకు మా సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందని చెప్పారు. సంఘం కేవలం ఈ ఒక్క సహాయానికే పరిమితం కాకుండా జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తుందని వెల్లడించారు. గ్రామ, మండల శాఖల ద్వారా సమాచారం అందించి సంఘం దృష్టికి తీసుకువచ్చిన నిరుపేద కుటుంబాల ఆడపిల్లల పెళ్లిళ్లు, నిరుపేద పిల్లల చదువులు, అలాగే వర్షాకాలంలో ఇబ్బందులు పడే నిరాశ్రయులకు తగిన ఆర్థిక సహాయాన్ని అందించే విధంగా జిల్లా సంఘం కృషి చేస్తుందని తెలిపారు. నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా స్థానిక సంఘ పెద్దల ద్వారానే ప్రతిపాదనలు పంపాలని, రాబోయే కాలంలో సేవా కార్యక్రమాలను మరింత నిరంతరాయంగా కొనసాగిచ్చే విధంగా జిల్లా మున్నూరు కాపు సంఘం ముందుకు పోతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అమిరిశెట్టి రామస్వామి, బండారు రామ్మూర్తి, స్వామి వివేక్ పటేల్, జిల్లా నాయకులు పూదరి శ్రీనివాస్, జక్కుల రాజేశం, ఉప్పు రాజ్ కుమార్, అమిరిశెట్టి పూర్ణచందర్, జాపతి రాజేష్, కొట్టే రవి, మల్క విక్రాంత్, జంబు పటేల్, పూదరి కార్తీక్, అందుగులపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు అడువాల మల్లయ్య, గ్రామ శాఖ నాయకులు అడువాల శ్రీను, అడువాల రామన్న, మామిడి అజయ్ పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగాల కోసం జూలై 20 వరకు దరఖాస్తులు ఆహ్వానం

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

తెలంగాణ ఓవర్సీస్ మానపవర్ కంపెనీ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ దేశాల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు 2026 జూలై 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జర్మనీ లో ట్రాన్స్ మిషన్ లైన్ టెక్నీషియన్/ఎలక్ట్రీషియన్, రిజిస్టర్డ్ నర్సులు, నాన్ హెల్త్ ఆస్పిల్డుంగ్, ఫిజియోథెరపిస్టులు, కమర్షియల్ వెహికల్ టెక్నీషియన్, ఒమాన్ లో ఎంబ్రాయిడరీ టైలర్, అగ్రికల్చర్ !! లాండ్రీ వర్కర్లు, ఇండస్ట్రియల్ నర్సులు, ఖతార్ లో హోమ్ కేర్ నర్సులు, సివిల్ ఇంజినీర్లు, సివిల్ సూపర్వైజర్లు, కాస్టింగ్ ఆఫీసర్లు, ఇజ్రాయెల్‌లో హోమ్ బేస్డ్ కేర్ గివర్స్, దుబాయ్ లో బైక్, టాక్సీ డ్రైవర్లు, స్టీల్ ఫిక్సర్, ఆర్‌సీసీ వర్కర్,



టైల్ మేసన్, షట్టరింగ్ కార్పెంటర్, సివిల్ ఫోర్‌మన్, సివిల్ సైట్ ఇంజినీర్, హెల్పర్, జపాన్ లో హోమ్ కేర్ నర్సులు, కెనడా లో హోమ్ కేర్ నర్సులు, సౌదీ అరేబియా లో టెక్నీషియన్లు, రష్యా లో టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఏసీ టెక్నీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, గ్రీస్ లో హౌస్ కీపింగ్, వెయిటర్లు, రిసెప్షనిస్టులు, పెయింటర్లు, టైల్ మేసన్లు, మారిషస్ లో హౌస్ కీపింగ్, క్యాషియర్, షెల్ఫ్స్ వర్కర్లు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఈ ఉద్యోగాలకు 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 2026 జూలై 20వ తేదీలోపు సమీకృత కలెక్టరేట్ లోని జిల్లా ఉపాధి కార్యాలయం, రూమ్ 233, పెద్దపల్లిలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని, ఇతర వివరాలకు 7382452944 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. విదేశాల్లో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత తమ భవిష్యత్తును మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

కోనరావుపేట మండలం సుద్దల గ్రామంలో నూతన పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు సర్పంచ్ కుంటేలి నాగరాజు తెలిపారు. శుక్రవారం గ్రామంలోని పోచమ్మ ఆలయ సమీపంలో ఆలయ పునర్నిర్మాణం పనుల కోసం భూమి పూజ చేశారు. గ్రామంలో ఇప్పటివరకు పోచమ్మ తల్లికి ఆలయం లేకపోవడంతో గ్రామస్తుల సహకారంతో ఆలయం నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేద పండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా ఆలయ నిర్మాణ పనులు చేపడతామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాయి, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కాశవేణి మహేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పెద్దపల్లి వార్త



చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారికి పోలీసులంటే భయం ఉండాలి

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు పోలీసులంటే భయం కలిగేలా అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశించారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ విభాగాల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీ సీ ఎస్ ఏసీపీలు కె రవీందర్, టి ప్రవీణ్ కుమార్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ బి.శ్రీనివాస్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నేరాల నియంత్రణ, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కేజీబీవీల్లో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రభాతవార్త:



పెద్దపల్లి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగిలి ఉన్న ఖాళీ సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అర్హత గల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జిల్లాలో ఖాళీగా ఉన్న సీట్ల వివరాలు.. ధర్మారం ఎంపిహెచ్ డబ్ల్యు కోర్సులో 25 సీట్లు, జూలపల్లి బిపిసిలో 12 సీట్లు, ముత్తారం (మంథని) సీఈసీలో 10 సీట్లు, ఓదెల ఎంపీసీలో 14 సీట్లు, బీపీసీలో 14 సీట్లు, పాలకుర్తిలో ఎమ్మెల్ టి 5 సీట్లు, బిపిసి 10 సీట్లు, రామగిరి కంప్యూటర్ సైన్స్ లో 15 సీట్లు, శ్రీరాంపూర్ సీఈసీలో 2 సీట్లు , ఎంపిహెచ్ డబ్ల్యు 2 సీట్లు, సుల్తానాబాద్ సీఈసీలో 6 సీట్లు అందుబాటులో ఉన్నాయని, కేజీబీవీల్లో విద్యార్థినులకు ఉచిత వసతి, భోజనం,పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నాణ్యమైన విద్య వంటి సదుపాయాల ఉంటాయని, పరిమిత సంఖ్యలో మాత్రమే సీట్లు ఉన్నందున, అర్హులైన విద్యార్థినులు వెంటనే సంబంధిత ప్రధానోపాధ్యాయులను సంప్రదించి ప్రవేశం పొందాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ఆర్ ఆర్ గార్డెన్ లో కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని తహసీల్దార్ ప్రకటన

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:

పెద్దపల్లి మండలం లోని వివిధ గ్రామాలు, పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకి చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు రంగంపల్లి లోని ఆరఆర్ గార్డెన్ లో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేయనున్నారు. ఈ మేరకు పెద్దపల్లి తహసీల్దార్ ఒక ప్రకటనతో తెలిపారు. సకాలంలో హాజరు కావాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయండి

లబ్ధిదారులను గుర్తించి మంజూరి చేయండి

అధికారులను ఆదేశించిన చొప్పదండి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి నియోజకవర్గం లో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరి లో అర్హులను త్వరితగతిన గుర్తించి, ఇళ్లను మంజూరి చేయడం తో పాటు ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో హౌజింగ్, చొప్పదండి నియోజకవర్గ ఆరు మండలాల మండల అభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ దేశంలో ఈ ప్రభుత్వం ఇవ్వని విధంగా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ దే అన్నారు. ఇప్పటికీ ఆనాడు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లే మనకు దర్శనం ఇస్తాయని అన్నారు. అదే స్ఫూర్తితో నేడు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి యుద్ధ ప్రాతిపదికన తెలంగాణ ప్రజా ప్రభుత్వం లో ఇందిరమ్మ ఇళ్లను ప్రజలకు ఇచిన హామీ మేరకు మొదటి విడత మంజూరి చేయడమే కాకుండా మొదటి విడత ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించి, నిరుపేదల కళను సాకారం చేయడం తో పాటు గృహప్రవేశాలు కూడా దిగ్విజయంగా జరిపించి, నేడు నిరుపేదల కళ్ళలో ఆనంద భాష్పాలు నింపిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం దే అన్నారు. అంతే ఉత్సాహం తో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరి కై తెలంగాణ ప్రజా ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపిక కూడా పూరి చేసి, రెండవ విడత ఇళ్లను కూడా మంజూరి చేసే క్రమంలో ముందుకు సాగుతుందని, ఇది తెలంగాణ ప్రజలు చేసుకున్న అదృష్టం అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. అలాగే మొదటి విడత లో పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను మంజూరి చేయడం లో అధికారులు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.



ప్రభుత్వ పాఠశాలలో బ్యాగుల పంపిణీ

చొప్పదండి,ప్రభాతవార్త:



మండల పరిధిలోని మంగళంపల్లి ప్రభుత్వ పాఠశాల లో శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని మండలంలోని మంగళ పల్లెలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన రవీందర్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి జిల్లాలో టిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి చేసిన సేవలను గుర్తింపుగా ఇచ్చిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికి వన్నె తెచ్చే విధంగా జిల్లాల్లో గ్రంథాలయాలను అభివృద్ధి చేసిన ఘనత రవీందర్ రెడ్డి కి దక్కుతుందని అన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉంటూ పార్టీ ప్రతిష్టతకు కృషి చేస్తున్న రెడ్డి భవిష్యత్తులో మరెన్నో పదవులు రావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలమ వన్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, నాయకులు పెద్దెల్లి సురేష్ ,ఏనుగు స్వామి రెడ్డి ,గాండ్ల లక్ష్మణ్, సుధాకర్ రెడ్డి, వేణు, ప్రధానోపాధ్యాయులు క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోనేరుపల్లి పాలకవర్గ కృషి అభినందనీయం

పంచాయతీ పాలకవర్గాలు ఆదర్శంగా తీసుకోవాలి

కొండగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి

చొప్పదండి,ప్రభాతవార్త:



పర్యావరణ పరిరక్షణ కోసం కోనేరుపల్లి పంచాయతీ పాలకవర్గ నిర్ణయం ఆదర్శప్రాయం, ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్చిదిద్దాలని సంకల్పం తో జ్యూట్ బ్యాగులు గ్రామ ప్రజలందరికీ ఉచితంగా పంపిణీ చేయడం గర్వించదగ్గ విషయం అని, కోనేరుపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని గ్రామాలు అన్ని ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్చిదిద్దాలని కొండగట్టు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ మేరకుచొప్పదండి మండలం కోనేరుపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యం తో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్లాస్టిక్ నిషేధిత గ్రామంగా ప్రకటిస్తూ గ్రామంలోని ప్రతి ఇంటికి శ్రీ దీపిక హాస్పిటల్ చైర్మన్, చైర్మన్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ డిసిసి కరీంనగర్ డా ఆర్ వెంకటేశ్వర్లు సౌజన్యంతో జ్యూట్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఆర్డీవో గీత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కొండగట్టు దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ఎంపిడిఓ వేణుగోపాల రావు, ఎం పి ఓ రాజగోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ తిరుపతి, వార్డు సభ్యులు కనకట్ల నరేందర్, వంశిక, మమత, కాట్నపల్లి సర్పంచ్ గన్ను శ్రీనివాస్ రెడ్డి, ఎ పి ఎం వాణిశ్రీ, ఎస్ బి ఎం కోఆర్డినేటర్ రమేష్, కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

పంచాయతీ కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ

చొప్పదండి,ప్రభాతవార్త:

మండల పరిధిలోని అర్నకొండ గ్రామంలో శుక్రవారం చొప్పదండి ఎ ఆర్ ఆర్ టీమ్ పంచాయతీ కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని సేవా కార్యక్రమాల్లో భాగంగా పంచాయతీ కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని ఎ ఆర్ ఆర్ టీమ్ పేర్కొంది. ఏ ఆర్ ఆర్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



రైతు భరోసా నిధుల విడుదలపై మల్యాల లో పాలభిషేకాలు

మల్యాల /ప్రభాతవార్త



రైతులకు పెట్టుబడి భారం తగ్గించి పంటల సాగుకు భరోసా కల్పించేందు కుగాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకకాలంలో 9,000 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేయడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ, శుక్రవారం మల్యాల మండల కేంద్రంలోని సోనియా గుడి వద్ద కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం గా ప్రజల కోసం ప్రజా పాలన విజయవంతంగా కొనసాగుతుందని అన్నారు, కార్యక్రమంలో మండలంలోని పలువురు కాంగ్రెస్ సర్పంచు, ఉప సర్పంచ్, మార్కెట్ కమిటీ, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్ లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు,

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

మల్యాల/ ప్రభాత వార్త



జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్కుమార్ కుటుంబ సమేతంగా శుక్రవారం ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ స్థానాచారి కపిందర్ వేదాశీర్వచనం అందించగా, ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి శేష వస్త్రాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ,చంద్రశేఖర్లతో పాటుగా మాల్యాల సిఐ రాజకుమార్ ఎసై సందీప్ లు పాల్గొన్నారు,

భవన నిర్మాణ మహిళా కార్మికులకు చీరల పంపిణీ

చొప్పదండి,ప్రభాతవార్త:

చొప్పదండి పట్టణంలో తెలంగాణ ఉద్యమకారుడు, యువనేత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మిత్రుడు జర్నలిస్ట్ కందుల స్కైలాబ్ గౌడ్ శుక్రవారం రోజున పేద భవన నిర్మాణ కార్మికులకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కైలాబ్ గౌడ్ మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ సపోర్ట్ లేకుండా, రాజకీయ యువ నేతగా జిల్లాలోనే కాకుండా, రాష్ట్రంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న రవీందర్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని అన్నారు మాజీ బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అలుపెరుగని ఉద్యమ నేత ఏనుగు

చొప్పదండి,ప్రభాతవార్త:

తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి, యువతరానికి ఆదర్శంగా నిలిచిన యువ నేత మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, రామగుండం నియోజకవర్గ డిజిటల్ సభ్యత్వ నమోదు ఇంచార్జి ఏనుగు రవీందర్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని శుక్రవారం చొప్పదండి నియోజకవర్గ కేంద్రం లో బి ఆర్ ఎస్ నేతలు, మండల బి ఆర్ ఎస్ అధ్యక్షులు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ బి ఆర్ ఎస్ అధ్యక్షులు బత్తిని సంపత్ ల ఆధ్వర్యం లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రవీందర్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి చిలుక రవీందర్, మాజీ మార్కెట్ చైర్మన్ అరెల్లి చంద్రశేఖర్, సర్పంచ్ బందారపు అజయ్ కుమార్, కౌన్సిలర్ కొత్త సుమలత గంగారెడ్డి, మాజీ సర్పంచ్ వెల్మ నాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్ లు మాడూరి శ్రీనివాస్, నలుమాచు రామకృష్ణ, కొత్తూరి నరేష్, సీపెల్లి గంగయ్య, బీసవేని రాజశేఖర్, గాండ్ల లక్ష్మణ్, ఎం డి జహీర్, ఎం డి అజ్జు, వెల్మ స్వామి రెడ్డి, వడ్లకొండ శ్రీనివాస్, పెద్దేలి అనిల్, నరేష్ రావణ్, అనుమల్ల రమేష్, అనుమల్ల నాగరాజు, బైర కన్నా, సాయి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆది సమక్షంలో కాంగ్రెస్ గూటికి మాజీ సర్పంచ్

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:

వేములవాడ రూరల్ మండలం తురుకాష్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ ఎస్‌కే హుస్సేన్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు, అలాగే పలువురు గ్రామస్తులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై విశ్వాసం ఉంచి ప్రజా సేవ కోసం ముందుకు వచ్చారని ఆయన పేర్కొన్నారు.గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంపై విశ్వాసంతో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.



రాబోయే రోజుల్లో గ్రామాభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షులు సోయినేని కర్ణాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వకుళభరణం శ్రీనివాస్, రంగు వెంకటేష్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోళ్లులో మోసం

తరుగు పేరిట కటింగ్

కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన రైతు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

కోనరావుపేట మండలం కనగర్తిలోని సింగిల్విండో కొనుగోలుకేంద్రంలో ధాన్యం విక్రయాల్లో జరిగిన మోసంపై జిల్లా కలెక్టర్కుఫిర్యాదు చేశారు. బాధిత రైతు జిల్లెల్ల తిరుపతిరెడ్డి కథనం ప్రకారం....కనగర్తిలోని కొనుగోలు కేంద్రంలో తాను 764 బస్తాల ధాన్యంఅమ్మినట్లు తెలిపారు. 764 బస్తాలకు తరుగు పేరిట రెండుకిలోల 600గ్రాముల చొప్పున ఎక్కువ తూకం వేశారని అన్నారు. తీరా మిల్లుకువెళ్లాక ఇవిగాక 120 కిలోల ధాన్యం తక్కువగా వచ్చిందని డబ్బులుకట్ చేశారన్నారు. 120 కిలోల తరుగుతో పాటు అదనంగా తూకంవేసిన 2 కిలోల 600 గ్రాముల చొప్పున నష్టపోయినట్లు ఫిర్యాదు.చేశారు. వీటితోనే నష్టపోగా తన ధాన్యంలో 3 బస్తాలు లెచ్చెప్పడంలేదన్నారు. ఇది ఒక్క రైతు పరిస్థితే కాదని సింగిల్విండోకొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులందరిదీ ఇదే పరిస్థితిఅన్నారు. ఈ విషయమై వెంటనే స్పందించిన కలెక్టర్ విచారజరిపించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

జగిత్యాల కేంద్ర విద్యాలయానికి 10 ఎకరాల భూమి కేటాయించాలి

ఎంపీ ధర్మపురి అర్వింద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాలలో ఏర్పాటు కానున్న కేంద్ర విద్యాలయానికి తెలంగాణ ప్రభుత్వం 5 ఎకరాల భూమిని కేటాయించడం స్వాగతించదగ్గ నిర్ణయమని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని వి కె బి ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఎంపీ ధర్మపురి అరవింద్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అరవిందు మాట్లాడుతూ అయితే, విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని భూ కేటాయింపును 10 ఎకరాలకు పెంచాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి లేఖ రాసినట్లు వెల్లడించారు.కేంద్ర విద్యాలయ సంఘం (కే వి ఎస్) నిబంధనల ప్రకారం 5 ఎకరాలు కనీస అవసరమే కాగా, మెట్రో నగరాల వెలుపల ఉన్న కేంద్ర విద్యాలయాలకు 10 ఎకరాలు అనువైన ప్రమాణమని ఆయన పేర్కొన్నారు. అదనపు భూమి ఉంటే విశాలమైన తరగతి గదులు, ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, భవిష్యత్తు విస్తరణకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించే అవకాశం ఉంటుందని వివరించారు.జగిత్యాల జిల్లా విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం అందించాలనే ఉద్దేశంతో గతంలోనే 10 ఎకరాల భూమి కేటాయించాలని కోరిన విషయాన్ని గుర్తు చేసిన ఎంపీ అర్వింద్ , విద్యార్థుల దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించి భూ కేటాయింపును 10 ఎకరాలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.కాస్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్హత లేకుండా విద్యాశాఖ మంత్రిగా ఉండడం సమంజసం కాదని పేర్కొన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చలిగల్ వాళ్ళంతరిలో కేంద్ర విద్యాలయానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించగా 50 కోట్ల విలువ చేసే భూమిచమని చెప్పడం సరికాదని ప్రభుత్వ భూమిని ప్రజల అవసరాలకు కోసం దానిని డబ్బులతో లెక్క కట్టడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు జగిత్యాల నియోజకవర్గం ఇన్చార్జి భోగ శ్రావణి ప్రవీణ్ డాక్టర్ అనుపరావు తదితరు పాల్గొన్నారు

అర్హులైన ఓటర్‌ని ఓటర్ జాబితాలో చేర్పించాలి

బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎస్ఐఆర్ కన్వీనర్ ఆంటోనీ రెడ్డి

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త : అర్హులైన ఓటర్ ని ఓటర్ జాబితాలో



చేర్పించాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎస్ ఐ ఆర్ కన్వీనర్ ఆంటోనీ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి అధ్యక్షతన, బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా ఎస్ ఐ ఆర్ కన్వీనర్ గరిపెల్లి ప్రభాకర్ గారి ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ సంబంధించి జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎస్ ఐ ఆర్ కన్వీనర్ ఆంటోనీ రెడ్డి హాజరై, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి బూత్‌లో బిఎల్ఎ2 లు, తొలి సభ్యులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఓటరిని ఓటరు జాబితాలో నమోదు చేయడం, లోపాలను సరిదిద్దడం, ఓటరు జాబితాను సంపూర్ణంగా రూపొందించడంలో చురుకుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలకు చెందిన తొలి సభ్యులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి, కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కుమ్మరి శంకర్, లింగంపల్లి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి, సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, బండ మల్లేశం, జిల్లా అధికార ప్రతినిధి రాజాసింగ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు రేగుల సంతోష్ బాబు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఉడుగుల యాదగిరి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కిరణ్ నాయక్, సెన్సార్ బోర్డు సభ్యురాలు వైశాలి, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, బిఎల్ఎ 2లు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మూడపల్లిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు భూమి పూజ

పాల్గొననున్న ప్రభుత్వ విప్ ఆది

చందుర్తి/ ప్రభాతవార్త

చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం భూమి పూజ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొట్టే ప్రభాకర్, గ్రామ సర్పంచ్ చిలుక అంజిబాబు లు శుక్రవారం తెలిపారు, 250 కోట్ల రూపాయలతో అన్ని హంగులతో వేములవాడ నియోజకవర్గం చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో ఈ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం 20 ఎకరాల స్థలాన్ని కేటాయించింది, వేములవాడ కోరుట్ల ప్రధాన రహదారిని ఆనుకొని ఈ పాఠశాలలో నిర్మిస్తున్నారు, మూడపల్లి గ్రామానికి యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేములవాడ వార్త

రోడ్డు కిందకు దూసుకెళ్లిన టాటా ఎసి వాహనం

తప్పిన ప్రమాదం

చందుర్తి / ప్రభాతవార్త



చందుర్తి మండల కేంద్రం శివారులో మోత్కురావుపేట వెళ్లే దారిలో రోడ్డు కోతకు గురికావడంతో శుక్రవారం టాటా ఏసీ వాహనం అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. స్థానికుల కథనం ప్రకారం భీమారం మండలం గోవిందారం గ్రామానికి చెందిన మహిళాలు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సేవకు టాటా ఎసి వాహనంలో వెళుతున్నారు. చందుర్తి శివారులోని అటవీ ప్రాంతంలో టాటా ఎసి అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్ళింది.డ్రైవర్ అప్రమత్తతో వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది.

ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలి

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశం

చందుర్తి / ప్రభాతవార్త



ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని ఆశిరెడ్డి పల్లి సర్పంచ్ బొజ్జ మల్లేశం అన్నారు.చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామంలోని అనుబంధ గ్రామం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు.. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో గత 4 సంవత్సరాల క్రితం మూతపడిన పాఠశాలను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ చేతుల మీదుగా పున: ప్రారంభించడం జరిగిందనీ అన్నారు.విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిసించి పాఠశాలను తీర్చిదిద్దడం జరిగిందని సర్పంచ్ అన్నారు..ఈ కార్యక్రమంలో మూడపల్లి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ మల్లేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి మహేష్, సి ఆర్ పి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో పర్యావరణ పరిశుభ్రత కార్యక్రమం

ఎడ్యుకేషన్ కేయూ, జూలై 3 ప్రభాతవార్త :

యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 4(టి) ఎయిర్ స్వాడ్రన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వార్షిక సామాజిక సేవాకార్యక్రమంలో భాగంగా శుక్రవారం "క్లీన్ అండ్ గ్రీన్" కార్యక్రమాన్ని 4(టి) ఎయిర్ స్వాడ్రన్ ఎన్‌సీసీ అసోసియేట్ ఆఫీసర్ ఫ్లయింగ్ ఆఫీసర్ డా.బి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతిహాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ పరిశుభ్రమైన, పచ్చని పరిసరాల నిర్మాణంలో ఎన్‌సీసీ క్యాడెట్లు పోషిస్తున్న పాత్ర అభినందనీయమని కొనియాడారు. సామాజిక బాధ్యతతో సేవాకార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న క్యాడెట్లను, కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ ఫ్లయింగ్ ఆఫీసర్ డా.బి.ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో 50మంది ఎన్‌సీసీ క్యాడెట్లు స్కూల్‌ఆఫ్ మేనేజ్‌మెంట్ అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రపరచడంతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు కృషిచేశారు.

ఐదవ రోజుకు చేరిన సింగరేణి అధికారుల నిరాహార దీక్ష

రామగిరి ప్రభాతవార్త



సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రామగుండం అర్ జీ3 ఏపీఏ ఏరియాలో జిఎం కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం ఐదవ రోజుకు చేరింది. ఏపీ ఏ జిఎం కొలిపాకనాగేశ్వరరావు, ఏరియా ఇంజనీర్ విజయ్ భాస్కర్ అధికారుల నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి అధికారులకు దీక్ష మాలలు వేసి శిబిరాన్నిప్రారంభించారు. న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించే వరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయని వారు పేర్కొన్నారు. ఈ నిరాహార దీక్షలో,దూప్‌సింగ్,ఏరియాఇంజినీర్,ఏపీఏ పీకల వెంకట్రావు, (ఈయం), 132 ఎస్.ఎస్ , గుగ్లోత్. లచ్చు,డిప్యూటీ మేనేజర్ , ఓసిపి2,ఆల్పుల మల్లిఖార్జున్,డిప్యూటీ సూపరింటిండెంట్ ఇంజినీర్(ఈయం), ఓసిపి2, ,పాగల్ల కోటేశ్వరరావు సీనియర్ సర్వే ఆఫీసర్, ఏపీఏ , జీ. అశోక్ కుమార్, సూపరింటిండెంట్ ఇంజినీర్(మైనింగ్),ఓ.సి.ఏం1, కోట రమేష్, డిప్యూటీ, మేనేజర్, సూపరింటిండెంట్ ఇంజినీర్ (మైనింగ్), ఓ.సి.ఏం1, గంజి సత్యార్థ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఓ.సి.ఏం1,ఆడే మధు,వెల్ఫేర్ ఆఫీసర్ ఏ.ఎల్.పి, బొల్లం సురేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.ఎల్.పి, పోతరాజు. మహేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.ఎల్.పి పాల్గొన్నారు.

విద్యుత్ ఘాతం సంఘటనపై విచారణ జరపండి

డిఈకి పిర్యాదు చేసిన నాయకులు, గ్రామస్థులు

రామగిరి ప్రభాతవార్త

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన తాత్కాలిక విద్యుత్ గ్రామ హెల్పర్ మెట్టురవి విద్యుత్ ఘాతానికి గురికాగా, ఈ సంఘటనపై విచారణ జరుపాలని విద్యుత్ మంథని డిఈ వెగ్గలం ప్రభాకర్ కి శుక్రవారం నాయకులు, గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గత నెల 30 తేదీ రోజున అందాద సాయంత్రం 04.50 గంటలకు పబ్బ మొగిలి ఇంటి వద్ద సిమెంట్ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్థంభంపై నుంచి విద్యుత్ ఘాతంతో కింద పడ్డాడు. ఇటీవల గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో తాత్కాలిక హెల్పర్ గా ఈయనను నియమించారు. ఈ క్రమంలో ప్రతిరోజు విద్యుత్ బల్బులు పెట్టె క్రమంలో ఎన్ పిడిసిఎల్ ఏఎల్ఏం తిప్పిరిశెట్టి రమేష్ కు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తాడు. రమేష్ ఎల్.సి ఇచ్చిన తర్వాత బల్బులు పెడుతాడు. ఈ క్రమంలో 30.06.2026 రోజున సాయంత్రం 04.40 గంటలకు రమేష్ సెల్ నెంబర్ 9505521754 కు రవి తన ఫోన్ 9553400812 ద్వారా 3 నిమిషాల 18సెకండ్లు మాట్లాడాడు. విద్యుత్ ఎల్ సి కోసం అనుమతి తీసుకున్నాడు. ఆ సమయంలో ఏఎల్ఏం రమేష్ అక్కడికి రాకుండా బల్బులు పెట్టుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. మెట్టు రవికి సహాయకుడిగా గ్రామ పంచాయితీ సిబ్బంది పంప్ ఆపరేటర్ కండె సంజీవ్, అక్కడి ఇంటి యజమాని పబ్బ మొగిళి అక్కడే ఉన్నారు. రవి స్తంభంపైకి బల్బ్ లు పెట్టే క్రమంలో విద్యుత్ ఘాతానికి గురైయ్యాడు. స్థంబం నుంచి కిందపడగా తీవ్రగాయాయ్యాయి. ఆయన ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో కరీంనగర్ లోని శ్రీ మయూక న్యూరో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. ఎల్ సి అడిగిన ఇవ్వకుండా బల్బులు పెట్టె సమయంలో అక్కడ లేకుండా ఫోన్ ద్వారానే విద్యుత్ వ్యవస్థను నడిపిస్తున్న ఏఎల్ఏం టి.రమేష్ పై విచారణ జరిపి, మెట్టు రవికి తగు న్యాయం చేయాలనీ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలి

సీతంపేటలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

ఉప సర్పంచ్ ఇందారపు నవీన్ క్షేత్రస్థాయి పరిశీలన

ముత్తారం, ప్రభాతవార్త:



ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఉప సర్పంచ్ ఇందారపు నవీన్ సూచించారు. శుక్రవారం ముత్తారం మండలం సీతంపేటలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని ఉప సర్పంచ్ ఇందారపు నవీన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నమోదు, ధృవీకరణ, మార్పులు, చేర్పులు, ఫారాల స్వీకరణ కార్యక్రమాన్ని స్వయంగా చూశారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న బీ ఎల్ ఓతో మాట్లాడి ఇప్పటివరకు పూర్తైన మ్యాపింగ్‌లు, అన్‌మ్యాపింగ్ నమోదులు, పెండింగ్ దరఖాస్తులు, వాటి పరిష్కార చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల ధృవీకరణ, మ్యాపింగ్ ప్రక్రియపై ఆరా తీశారు. ఇంటింటి సర్వే ప్రక్రియలు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా బీఎలఓలు, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించి తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇందారపు నవీన్, గంగుల కుమార్, లింగం సురేష్, ప్రవీణ్, సుధీర్ పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

6వ కౌన్సిలర్ శ్రీలత క్రాంతి

మంథని ప్రభాతవార్త:

అంగన్వాడీ కేంద్రాలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మంథని మున్సిపల్ 6వ వార్డు కౌన్సిలర్ పోతరవేన శ్రీలత క్రాంతి అన్నారు. శుక్రవారంబోయిన్ పేట్ లోని 6వ వార్డ్ లో ఉన్న అంగన్వాడీ సెంటర్ ని సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బాలామృతం, కోడి గుడ్లు పంపిణి చేశారు. అనంతరం మాట్లా డుతూ అంగన్వాడి కేంద్రం కేంద్రాలకు వచ్చే చిన్నారులకు, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం ప్రభుత్వం ఇస్తుందని దీనిని పూర్తిస్థాయిలో ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ రజితమాల తో పాటు పలువురు పాల్గొన్నారు.



క్రైస్తవ మైనారిటీల నుంచి ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి, ప్రభాతవార్త: తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ హైదరాబాద్ 2026..27 ఆర్థిక సంవత్సరానికి గాను కుట్టు మిషన్, చిరు వ్యాపారం, ఈ బైక్, ఈ స్కూటీ, మోటార్ బైక్ రంగాల కోసం అర్హులైన క్రైస్తవ మైనారిటీల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లాలో ఆయన వివరాలు వెల్లడించారు. క్రైస్తవ మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులందరూ కుట్టు మిషన్, చిన్న వ్యాపార యూనిట్లకు 21 నుండి 55 సంవత్సరాల వయస్సు, ఈ బైక్, ఈ స్కూటీ, మోటార్ బైక్ యూనిట్లకు 21 నుండి 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తేదీ 03.07.2026 నుండి తేదీ 18.07.2026 సాయంత్రం 5:00 గంటల వరకు హెచ్‌టిటిపిఎస్://టిజిఓబిఎమఎమఎస్.సిజిజి.గోవ్.ఇన్/ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం దరఖాస్తు దారులు 04023391067 నంబరును సంప్రదించవచ్చని లేదా ఆన్‌లైన్ వెబ్‌సైట్ హెచ్‌టిటిపిఎస్://టిజిసిఎమఎఫ్‌సి.ఇన్/ ను సందర్శించవచ్చని తెలిపారు. అర్హత కలిగిన క్రైస్తవ మైనారిటీలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కోరారు.

మంథని వార్త



ఘనంగా ఆది వరహా స్వామివారి మాస కళ్యాణం

రామగిరి ప్రభాతవార్త



కమాన్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆది వరహాస్వామి మాస కళ్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోత్చరాల మధ్య కళ్యాణం జరుగా భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు. అలాగే స్వామివారి కళ్యాణానికి స్థానిక పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహించే చిలుముల మధునయ్య, నాగరాజులు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి వారి వద్ద చిలుముల మధునయ్య అనురాధ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ కాలేజీకి మునుగ చెట్ల పంపిణీ

మంథని రూరల్ ప్రభాతవార్త:



మంథని మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న నర్సరీ నుండి మంథని జేఎన్టీయూ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పింగిలి కృష్ణారెడ్డికి 50 మునగ చెట్లను సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ పంపిణీ చేశారు. శుక్రవారం జెఎన్టియు కళాశాలకు వెళ్లి ఈ చెట్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నర్సరీ నుండి ఎవరైనా మొక్కలు కావలసిన వాళ్లు తీసుకెళ్లి నాటుకొని కాపాడుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కెసెట్టి మధుకర్, గ్రామ కాంగ్రెస్ నాయకులు చిదురాల దామోదర్ రెడ్డి జేఎన్టీయూ సిబ్బంది రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు హక్కు అత్యంత విలువైనది

జిల్లెల్లపల్లి సర్పంచ్ గడ్డం రాజేశం

జిల్లెల్లపల్లిలో ఎస్ఐఆర్ సర్వే

ముత్తారం, ప్రభాతవార్త:



ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత విలువైనదని జిల్లెల్లపల్లి సర్పంచ్ గడ్డం రాజేశం అన్నారు. ముత్తారం మండలం జిల్లెల్లపల్లి గ్రామ పంచా యతీలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సం దర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బి ఎల్ ఎ, బి ఎల్ ఓలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ సమగ్ర సర్వే నిర్వహించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం, తప్పులు ఉంటే వాటిని సరిదిద్దడం, కొత్తగా అర్హత పొందిన యువత ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను గుర్తించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

సర్‌పై ప్రజల్లో చైతన్యం కల్పించడంలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎక్కడ?

సామాజిక కార్యకర్త గోనె మహేందర్ రెడ్డి కీలక ప్రశ్నలు

ఎండపల్లి ప్రభాతవార్త



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పునశ్చరణ (సర్) ప్రక్రియ విజయవంతం కావాలంటే ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకుని ప్రజలకు అవగాహన కల్పించాలని కొత్తపేట గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గోనె మహేందర్ రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను కలిసేందుకు ఇంటింటికీ వెళ్లే నాయకులు, ఇప్పుడు సర్ వంటి కీలక కార్యక్రమంలో కూడా అదే స్థాయిలో ప్రజలకు అండగా నిలవాలని ఆయన సూచించారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని చెప్పే నాయకులు, ఓటర్ల జాబితా సక్రమంగా ఉండేలా చేపట్టిన ప్రత్యేక సమగ్ర పునశ్చరణపై ప్రజలకు అవగాహన కల్పించడం కూడా తమ బాధ్యతగా భావించాలని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో వృద్ధులు, నిరక్షరాస్యులు, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన కుటుంబాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఫారాలు నింపడంలో వారికి సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు.సరైన సమాచారం లేకపోవడం వల్ల ఫారాల్లో పొరపాట్లు జరిగే అవకాశం ఉందని, దీంతో అర్హులైన ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, బీఎల్వోలు, అధికారులు కలిసి అవగాహన శిబిరాలు నిర్వహించి ప్రతి ఓటరికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటర్ల జాబితా ఖచ్చితత్వం ఎంతో కీలకమని పేర్కొన్న మహేందర్ రెడ్డి, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చెరువుల ఆక్రమణలను అరికట్టాలి

ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కోమల్ల జలేందర్

గొల్లపల్లి, ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చెరువులు, కుంటలు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయని, దీంతో వాటిపై ఆధారపడి జీవించే ముదిరాజ్, బెస్త తదితర మత్స్యకార కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడుతోందని గొల్లపల్లి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోమల్ల జలేందర్ ఆందోళన వ్యక్తం చేశారు.శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని అనేక మత్స్యకార కుటుంబాలు చెరువులు, కుంటలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. అయితే రోజురోజుకూ చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతుండటంతో వారి ఉపాధికి తీవ్ర విఘాతం కలుగుతోందని అన్నారు.అంతేకాకుండా చెరువులు, కుంటల విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల వర్షపు నీటి నిల్వ సామర్థం తగ్గి గ్రామాల్లో భూగర్భ జలాల మట్టం క్షీణించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. చెరువుల పరిరక్షణ అనేది కేవలం మత్స్యకారుల జీవనోపాధికే కాకుండా గ్రామీణ పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయాభివృద్ధి, భూగర్భ జలాల సంరక్షణకు కూడా ఎంతో కీలకమని చెప్పారు.ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి మండలంలోని అన్ని చెరువులు, కుంటల వద్ద సమగ్ర సర్వే నిర్వహించి హద్దులను స్పష్టంగా గుర్తించాలని, ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని చెరువులు, కుంటలను పరిరక్షించడంతో పాటు మత్స్యకారుల జీవనోపాధిని కాపాడాలని కోమల్ల జలేందర్ కోరారు.

చినుకులకే ఇలా ప్రయాణమా..?

వర్షం పడితే రహదారి చెరువే...

ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

రోడ్డుపై బైఠాయించిన బీజేపీ రాష్ట్ర మండలి సభ్యుడు కొమ్ము రాంబాబు యాదవ్

ఎండపల్లి ప్రభాతవార్త



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో రాయపట్నం-కరీంనగర్ రాష్ట్ర రహదారి నంబర్-7 మరోసారి అధికారుల నిరక్ష్యానికి అద్దం పట్టింది. గురువారం రాత్రి కురిసిన స్వల్ప వర్షానికే రహదారిపై భారీగా నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర మండలి సభ్యుడు, కొత్తపేట మాజీ సర్పంచ్ కొమ్ము రాంబాబు యాదవ్ రోడ్డుపైనే బైఠాయించి ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిందన్నారు. వర్షం పడిన ప్రతిసారీ గుంతల్లో నీరు నిలవడంతో రహదారి ఎక్కడ ఉందో, గుంత ఎక్కడ ఉందో గుర్తించడం కూడా కష్టమవుతోందని అన్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో రిక్షాలు, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో ఇదే రహదారిపై జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారని, అనేక కుటుంబాలు తీవ్ర విషాదాన్ని చవిచూశాయని గుర్తుచేశారు. అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం, రోడ్లు-భవనాల శాఖ అధికారులు వెంటనే స్పందించి రహదారికి నాణ్యమైన శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం గుంతలు పూడ్చడం కాకుండా నీరు నిలవకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని కోరారు.స్థానిక ప్రజలు కూడా ఇదే సమస్యను ప్రస్తావిస్తూ, ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే కంటే ముందుగానే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

గణపతి ఆలయంలో అభిషేకం

ధర్మపురి,ప్రభాతవార్త



సంకష్టహర చతుర్థి పర్వదిన సందర్భంగా శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని గణపతి దేవాలయంలో శుక్రవారం అభిషేకం నిర్వహించారు. ఉదయం వేళలో అర్చకులు, వేద పండితులు స్వామివారికి గణపతి ఉప నిషత్తులతో అభిషేకం, హారతి, మంత్ర పుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుండి క్షేత్రానికి వచ్చిన భక్తులు గణపతి ఆలయంతో పాటు, శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్లను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.



కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కేజీబీవీ పాఠశాలలు

జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:

జగిత్యాల జిల్లాలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.పేద విద్యార్థినులకు ఉచితంగా,అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించడంతో పాటు,6వ తరగతి నుంచే జేఈఈ,నీట్,క్లాట్,ఈఏపీసెట్ వంటి ప్రతిష్టాత్మక జాతీయ,రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు జిల్లాలో మూడు కేజీబీవీలను ప్రత్యేకంగా ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్రత్యేక పాఠశాలల్లో విద్యార్థినుల కోసం అదనంగా పోటీ పరీక్షలకు కోచింగ్ ఇచ్చేందుకు ఎక్స్ టర్నల్ టీచర్స్, అదునాతన లైబ్రరీ,కంప్యూటర్ ల్యాబ్,సైన్స్ లేబరేటరీలను ఏర్పాటు చేశారు. విద్యార్థినులు రాసే పోటీ పరీక్షల ఫీజులను కూడా ప్రభుత్వమే భరిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కేజీబీవీలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి ఇప్పటికే టీజీఆర్జేసీ ఎంట్రన్స్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయింది.కాగా,ఈ విద్యాసంవత్సరం 6వ తరగతిలో ప్రతి పాఠశాలలో అర్హులైన 20 మంది స్థానిక విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించారు.మిగిలిన 20 సీట్ల భర్తీ కొరకు ఈ నెల 12వ తేదీన జిల్లాలోని మిగిలిన 13 కేజీబీవీలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.జిల్లాలోని కేజీబీవీ జగిత్యాల,కేజీబీవీ కోరుట్ల, కేజీబీవీ ఇబ్రహీంపట్నం లలో ఈ శిక్షణ అందుబాటులో ఉంటుందని ఈ ప్రత్యేక కోర్సులలో చేరాలనుకునే 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థినులు,ప్రస్తుతం తమకు అందుబాటులో ఉన్న కేజీబీవీలలో అడ్మిషన్ తీసుకొని ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు చేసుకోవడానికి జూలై 5వ తేదీ చివరి గడువు కాగా,జూలై 12వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందని కలెక్టర్ కోరారు.

ధర్మపురి వార్త

పశువులకు లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం

బుగ్గారం ప్రభాతవార్త



చిన్నాపూర్ గ్రామంలో పశువులను లంపి స్కిన్ వ్యాధి ఎల్ ఎస్ డి నుండి రక్షించే ఉద్దేశ్యంతో లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని డా. తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. గ్రామంలో అర్హత కలిగిన 23 పశువులకు టీకాలు వేసి, వ్యాధి నివారణపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పశువులలో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశువైద్య అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ ప్రశాంత్, సిబ్బంది మనోజ్, గౌస్, కుమారస్వామి, సుల్తానా పాల్గొని టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గట్టు శారదాగంగారం, ఉప సర్పంచ్ చట్ల శ్రీనివాస్ , అలాగే గ్రామానికి చెందిన పలువురు పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ బోనాలు

వెల్గటూర్ ప్రభాతవార్త :



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గంగమ్మ బోనాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు, ఉదయం నుండి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఒగ్గు కళాకారులు డప్పుచప్పులతో మహిళలు సాంప్రదాయ బద్ధంగా బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు గంగపుత్ర సంఘం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించారు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండమీది కవిత గోపి , మాజీ సర్పంచ్ బండమీది ముత్తయ్య, గుమ్ముల వెంకటేష్, గుమ్ముల సతీష్, మల్లేష్, ఎన్నారై లు గుమ్ముల నారాయణ, గుమ్ముల బుచ్చయ్య, ఎర్రోళ్ల మహేష్, బండమీది రమేష్, జగదీష్ హోటల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు,

సీఎస్‌సీ డిజిటల్ సేవ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తేవాలి

ఎంపీ ధర్మపురి అరవింద్‌కు వినతి

జగిత్యాల, బ్యూరో ప్రభాత వార్త:రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజా సేవలను కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) డిజిటల్ సేవా కేంద్రాల ద్వారా డిజిటలైజేషన్ చేసి గ్రామీణ ప్రజలకు చేరువ చేయాలని తెలంగాణ సీఎస్‌సీ వీఎల్ఈ డిజిటల్ సేవా సొసైటీ (టీసీవీడీఎస్ఎస్) ప్రతినిధులు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ కు వినతిపత్రం సమర్పించారు.జగిత్యాల జిల్లాలో నిర్వహించిన 'దిశ' కార్యక్రమానికి హాజరైన ఎంపీ అరవింద్‌ను శుక్రవారం కలిసి సొసైటీ ప్రతినిధులు తమ సమస్యలు, సూచనలను వివరించారు. ఈ సందర్భంగా టీసీవీడీఎస్ఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 13 వేలకుపైగా సీఎస్‌సీ డిజిటల్ సేవా కేంద్రాలు గ్రామీణ స్థాయిలో ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలను అందిస్తున్నాయని తెలిపారు.

సీఎంఆర్ బియ్యం సేకరణను వేగవంతం చేసి సకాలంలో అందజేయాలి

సీఎంఆర్ రైస్ డెలివరీ సమస్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

లక్ష్యం మేరకు బియ్యాన్ని సకాలంలో అందజేయాలని రైస్ మిల్లర్లకు ఆదేశం

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



జిల్లాలోని ఎఫ్సీఐ గోదాములో ఉన్న రేక్ మూమెంట్ పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారియోను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో సీఎంఆర్ రైస్ డెలివరీ అంశాలపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎఫ్సీఐ, సివిల్ సప్లై అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో సీఎంఆర్ రైస్ డెలివరీ ప్రక్రియను పర్యవేక్షించడంతో పాటు రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్దపల్లి జిల్లాలోని ఎఫ్సీఐ గోదాములో ఉన్న రేక్ మూమెంట్ పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సీఎంఆర్ రైస్ డెలివరీలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని, ఎఫ్సీఐ వారు సమన్వయంతో వ్యవహరించి బియ్యం సేకరణను వేగవంతం చేయాలని కోరారు. జిల్లాకు సంబంధించి వ్యాగన్ మూమెంట్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సీఎంఆర్ రైస్ డెలివరీలో ఎటువంటి జాప్యం జరగకూడదని, లక్ష్యం మేరకు బియ్యాన్ని సకాలంలో అందజేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీఎసఓ శ్రీనాథ్, డీఎం శ్రీకాంత్, సివిల్ సప్లై కార్పొరేషన్ డీఎం రవి కుమార్, రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తితో ఆర్థిక ప్రగతి

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ఎస్హెచ్జీ మహిళల

ఉపాధికి మార్గం.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

తంగళ్ళపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను

ప్రారంభించిన జిల్లా కలెక్టర్

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త



ఇందిరా మహిళా శక్తి యూనిట్లు మహిళా సంఘాల ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.ఇందిరా మహిళా శక్తి కింద తంగళ్ళపల్లి మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) మహిళలు వెంకటసాయి కోల్డ్ ప్రెస్ ఆయిల్ !! ఫ్లోర్ మిల్ యూనిట్, కోవిదా మిల్క్ పాయింట్ ఏర్పాటు చేసుకోగా,జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రారంభించారు.వాటి పని తీరు, ఉపాధి, ఆదాయం తదితర వివరాలను మహిళలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కింద రెండు యూనిట్లు ప్రారంభించామని తెలిపారు.ఒక యూనిట్లో కోల్డ్ ప్రెస్సింగ్ ఆయిల్, పిండి గిర్ని, ఇతర దాదాపు ఆరు యంత్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. దాదాపు రూ. 11 లక్షల 50 వేలతో యూనిట్ ప్రారంభించారని వివరించారు. దీనికి పీ ఎం ఎఫ్ ఎం ఈ కింద రూ . 3 లక్షల 50 వేల సబ్సిడీ అందుతుందని వెల్లడించారు. అలాగే మరో మహిళ డైరీ యూనిట్ ను ఏర్పాటు చేసుకున్నారని, దీనికి మహిళా సంఘాల నుంచి దాదాపు రూ.5 లక్షల రుణం ఇప్పించామని తెలిపారు. ఇక్కడ ఇతర డైరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇలాంటి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేసేందుకు మహిళలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. యూనిట్లు ఏర్పాటు చేయడంతో ఉపాధితోపాటు మహిళా సాధికారతకు దోహదం చేస్తుందని వివరించారు.నిన్న బ్యాంకర్ల సమావేశంలో ఇదే విషయంపై చర్చించి,మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ మహిళా, పురుష అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆర్ సేథీ (ళి శీనిగి) ఆధ్వర్యంలో అందుబాటులో ఉందని వెల్లడించారు. శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా రాణించేందుకు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మల్లికార్జున రావు, ఏఎంసీ వైస్ చైర్మెన్ నర్సింగం, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఇంచార్జి ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ మీర్జా, సర్పంచ్ లక్ష్మీరాజు,తదితరులు పాల్గొన్నారు.

మహిళ ప్రాణాలను కాపాడిన పోలీసు సిబ్బందికి డీజీపీ ప్రశంసలు

-నగదు రివార్డు ప్రకటన

మెట్పల్లి,ప్రభాతవార్త:



విధి నిర్వహణలో అప్రమత్తత, వేగవంతమైన స్పందనతో ఓ మ హిళ ప్రాణాలను కాపాడిన మెట్పల్లి పోలీస్ స్టేషన్కు చెందిన ఏఎస్ఐ అన్వర్ బేగ్, కానిస్టేబుల్ ప్రసాద్ సేవలను రాష్ట్ర పోలీసు శాఖ అత్యున్నత స్థాయిలో గుర్తించి, ఈసంద ర్భంగా శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సివి ఆనంద్ ఇద్దరు పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తూ నగదు రివార్డును ప్రకటించారు.అలాగే పోలీసు సిబ్బంది చూపిన సమయస్ఫూర్తి,మానవీయ దృక్పథం,విధి పట్ల నిబద్ధతను ప్రత్యేకంగా ప్రశంసించారు.ప్రజల ప్రాణ రక్షణే పోలీసుల అత్యున్నత బాధ్యత అని పేర్కొంటూ, అత్యవసర పరిస్థితుల్లో ఇలాంటి వేగవంతమైన స్పందన ప్రతి పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని డిజిపి అభినందించారు.వివరాల్లోకి వెళితే..జూన్18,2026న మెట్పల్లి పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన ఓ దంపతుల మధ్య కుటుంబ కలహాలు చోటుచేసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ ఎస్ఆర్ఎస్పి కాలువ వద్దకు వెళ్లి ఆత్మహత్యకు ప్రయత్నించింది.ఈవిషయమై డయల్112 ద్వారా సమాచారం అందిన వెంటనే మెట్పల్లి పోలీసులు అత్యంత వేగంగా స్పందించి, సమాచారం అందుకున్న కేవలం 15 నిమిషాల్లోనే ఏఎస్ఐ అన్వర్ బేగ్, కానిస్టేబుల్ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమర్థంగా అంచనా వేసి, చాకచక్యంగా వ్యవహరించి మహిళను ఆత్మహత్యాయత్నం నుంచి రక్షించారు.అనంతరం ఆమెను సురక్షితంగా పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి, దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. మెటుపల్లి పోలీస్ సిబ్బందికి డిజిపి నుండి రివార్డు,ప్రశంస రావడం పట్ల తోటి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పిఎంజే కేసులో మరో ఇద్దరు కస్టడీకి

కరీంనగర్ క్రైమ్ ప్రభాతవార్త:

పీఎంజే నగల దుకాణం దోపిడీ కేసులో మరో ఇద్దరు నిందితులను మూడు రోజుల విచారణ నిమిత్తం పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో 11వ నిందితుడైన యాదవ్ అలియాస్ జైనులాబ్దిన్, 16వ నిందితుడిగా ఉన్న ఆదిల్ ఖాన్ లను విచారణ కొరకు కస్టడీ పిటిషన్ దాఖలు చేయగా కోర్టు అనుమతించింది. ఆ ఇద్దరిని మూడు రోజుల కస్టడీ నిమిత్తం పోలీసులు తీసుకువచ్చారు. కస్టర్డ్ మూవీస్ అనంతరం తిరిగి జైలుకు తరలించనున్నారు.

రామగుండం అభివృద్ధికి ఎన్టీపీసీ పెద్దపీట వేయాలి

ప్రభావిత ప్రాంతాలకే సీఎస్ఆర్ నిధులు..

రెండు ఆర్వోబీల నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

ఎన్టీపీసీ అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ స్పష్టం

గోదావరిఖని ,ప్రభాతవార్త:

రామగుండం నియోజకవర్గ అభివృద్ధిలో ఎన్టీపీసీ సంస్థ మరింత బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. సంస్థ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఎన్టీపీసీ కార్యకలాపాల ప్రభావానికి గురైన ప్రాంతాల అభివృద్ధికే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం మేయర్ మహంకాళి స్వామి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణశ్రీతో కలిసి ఎన్టీపీసీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పలు కీలక అంశాలను ప్రస్తావించారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల విస్తరణ, రహదారుల అభివృద్ధి, వరద నివారణ చర్యలు, సంస్థ సామాజిక బాధ్యత నిధుల వినియోగం తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.ఎన్టీపీసీ సీఎస్ఆర్, సీడీ నిధులను ప్రభావిత గ్రామాలు, కాలనీల అభివృద్ధికే వినియోగించాలని ఎమ్మెల్యే కోరారు. కేవలం సీఎస్ఆర్ కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకుండా, సంస్థ చేపట్టే రెగ్యులర్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనుల్లోనూ స్థానిక ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. ప్రభావిత ప్రాంతాలను దత్తత తీసుకుని రహదారులు, తాగునీరు, డ్రైనేజీలు, వీధిదీపాలు, పారిశుద్ధ్య సదుపాయాలు వంటి మౌలిక వసతులను కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.రాజీవ్ రహదారిపై పెరుగుతున్న రద్దీ, తరచూ జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఎంఆర్వో కార్యాలయం నుంచి గోదావరి వంతెన వరకు నాలుగు రైల్వే ఓవర్బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. వీటిలో కనీసం రెండు ఆర్వోబీల నిర్మాణ బాధ్యతను ఎన్టీపీసీ స్వీకరించాలని కోరారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.ఎంఆర్వో కార్యాలయం నుంచి ఇల్లందు గెస్ట్హౌస్ వరకు సర్వీస్ రోడ్డు విస్తరణకు అనువుగా ఎన్టీపీసీ తన ప్రహరీ గోడను వెనక్కి జరిపి నిర్మించాలని సూచించారు. అలాగే శాలపల్లి రోడ్డులోని సోలార్ ప్లాంట్ ప్రహరీ గోడను కూడా వెనక్కి జరిపితే రహదారి విస్తరణకు వీలవుతుందని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అభివృద్ధి పనుల్లో సంస్థ చొరవ చూపాలని కోరారు.నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన భవన నిర్మాణ రుసుములను నిబంధనల ప్రకారం చెల్లించి, క్వార్టర్ల నిర్మాణానికి అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. వర్షాకాలంలో వరద ముంపు సమస్య తలెత్తకుండా ఎన్టీపీసీ వ్యర్థ జలాలు ప్రవహించే కాలువల్లో పూడిక తొలగింపు పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలను నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు.సమావేశంలో మేయర్ మహంకాళి స్వామి నగర అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలను వివరించగా, అధికారులు వాటి అమలుపై చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ఎన్టీపీసీ, నగరపాలక సంస్థ, జిల్లా యంత్రాంగం పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, ఎన్టీపీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రవీణ్, ఏజీఎం (హెచ్ఆర్) రంజన్ సాహూ, సీఎస్ఆర్ అధికారులు సూర్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలైతే రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

